ఒర్పు అనేది ఎంత చేదుగా ఉంటుందో, దాని వల్ల లభించే ప్రతిఫలం అంత తీయగా ఉంటుంది.




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 125 | శనివారం 11 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## 2047కల్లా ఏపీ నంబర్ 1



- గేమ్ చేంజర్ పాత్రలో రాష్ట్రం: చంద్రబాబు
- చింతా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం
- పేద విద్యార్థులను దత్తత తీసుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య
- బయో ఇథనాల్ ప్లాంటుతో వాతావరణ సమతుల్యత.. రైతులకూ మేలు
- 'నందిని సేవ్ ది బుల్' సరికొత్త ఆవిష్కరణ
- నెల్లూరు జిల్లాలో విశ్వసముద్ర ప్రాజెక్టులను ప్రారంభించిన సీఎం

**నెల్లూరు-సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** భారత్ 2047కల్లా ప్రబల ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తుందని.. ప్రపంచంలో నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్ కూడా దేశంలో నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని చెప్పారు. పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో రాష్ట్రం గేమ్ చేంజర్ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రపంచంలో తెలుగుజాతి నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని తెలిపారు. విశాఖలో రూ.88 వేల కోట్లతో ఏఐ సెంటర్ రాబోతోందని.. ఇది రాష్ట్ర భవిష్యత్‌కు గేమ్ చేంజర్ కానుందని వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌ను, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శశిధర్ పేరుతో నెలకొల్పిన చింతా శశిధర్ ఫౌండేషన్ నిర్మించిన 'నందగోకులం లైఫ్ స్కూల్', 'నంది పవర్ ట్రెడ్‌మిల్ మిషన్',

- మిగతా 2లో..

## దగ్గు సిరప్ మరణాలపై పిల్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు



**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** మధ్యప్రదేశ్‌లో నాణ్యతలేని కోల్డ్రిఫ్ దగ్గు సిరప్‌తో 22మంది మరణించిన సంగతి తెలిసిందే. దగ్గు సిరప్ మరణాలపై జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీతో స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. న్యాయవాది, పిటిషనర్ విశాల్ తివారీ తన కెరీర్‌లో ఎన్నిసార్లు పిల్‌లు దాఖలు చేశారని ప్రశ్నించింది. ప్రస్తుతం నిషేధించబడిన కోల్డ్రిఫ్ సిరప్ తయారీ సంస్థ ఉన్న మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు పరస్పరం నిందించుకుంటూ, విమర్శలకు దిగుతున్నాయని, రాష్ట్రాల దర్యాప్తులో ఎటువంటి గణనీయమైన చర్యలు తీసుకోకుండానే సమయం వృధా అవుతోందని తివారీ అన్నారు. తివారీ కేంద్రీకృత దర్యాప్తును కోరారు.

## ట్రంప్ నోబెల్ ఆశలు ఆవిరి




- మరియా కొరీనా మచాడోకు శాంతి బహుమతి
- ఈసారి వెనిజులా నేతకు దక్కిన అవకాశం
- యుద్ధాలు ఆపానన్న అమెరికా అధ్యక్షుడికి దక్కని గౌరవం
- తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కిన శ్వేతసౌధం
- ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆకాంక్షలకు అనుగుణంగా బహుమతులు ప్రకటన
- ఇవి ట్రంప్ వాదనలను బట్టి ఉండవు: నోబెల్ కమిటీ స్పష్టీకరణ

**ఓస్లో -సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ప్రపంచంలో పలు యుద్ధాలు ఆపాననీ, ఈ సారి నోబెల్ శాంతి బహుమతి తననే వరిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి నిరాశే ఎదురైంది. ఈ ఏడాది శాంతి బహుమతి వెనిజులాకు చెందిన ప్రతిపక్ష కార్యకర్త, ఎంపీ మరియా కొరీనా మచోడాకు దక్కింది. వెనిజులా ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం మచోడా చేసిన కృషికి గుర్తింపుగా ఆమెకు ఈ పురస్కారాన్ని అందిస్తున్నాని నోబెల్ కమిటీ తెలిపింది. వాస్తవానికి

- మిగతా 2లో..

## ఆర్ఎస్ఎస్-బీజేపీలది ఫ్యూడల్ భావజాలం: మల్లికార్జున ఖర్గే



**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** తాజాగా కుల వేధింపుల వల్ల హర్యానా దళిత ఐపిఎస్ అధికారి పురాన్ కుమార్ తనని తాను తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య పాల్పడ్డారు. ఇటీవలి కాలంలో దళితులపై జరిగిన దాడుల ఘటనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. ప్రధాని మోడీ హయాంలో దళితులు, ఆదివాసీలపై నేరాలు పెరిగిపోతున్నాయని ఖర్గే తీవ్రంగా విమర్శించారు.

- మిగతా 2లో..

## 14 ఏళ్ల బాలుడికి.. 28 ఏళ్ల వ్యక్తి గుండె




**తిరుపతి -సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురైన 28 ఏళ్ల యువకుడి గుండె.. తిరుపతికి చెందిన 14 ఏళ్ల బాలుడికి పునర్జన్మనిచ్చింది. గుంటూరుకు చెందిన పి.విజయకృష్ణ (28) రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కుటుంబసభ్యులు ఆయనను గుంటూరులోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించిన వైద్యులు ఆ విషయాన్ని కుటుంబసభ్యులకు వివరించి అవయవదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు అంగీకరించారు. తిరుపతి జిల్లా సత్యవేడు ప్రాంతానికి చెందిన బాలుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

- మిగతా 2లో..

## సంక్రాంతి నాటికి డీఎస్సీ




**విజయవాడ-సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరో గుడ్ న్యూస్ చెప్పారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, కళాశాల విద్య ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన డీఎస్సీ జనవరిలో నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా డీఎస్సీ, టెట్ ఉంటాయని పునరుద్ఘాటించారు. ప్రతిఏటా డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేష్ మరోసారి ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో టెట్, 2026 జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ నిర్వహించి,

- మిగతా 2లో..

## ఇక డిస్కమ్‌ల పోటీ

- ఒకే ప్రాంతంలో బహుళ డిస్కమ్‌ల విద్యుత్ సరఫరా
- ప్రస్తుత నెట్‌వర్క్‌ను వాడుకుని వ్యాపారం చేసుకునే చాన్స్
- ముసాయిదా విద్యుత్ సవరణ బిల్లు-2025 తెచ్చిన కేంద్రం



**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఒకే ప్రాంతంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ డిస్కమ్‌లు రావొచ్చు. వినియోగదారుడు తనకు నచ్చిన డిస్కమ్ నుంచి కరెంట్ కొనుగోలు చేయవచ్చు. డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలంటే విధిగా నెట్‌వర్క్ (స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు) కలిగి ఉండాలనే నిబంధన సడలింపు. ఇప్పటికే ఒక ప్రాంతంలో ఉన్న డిస్కమ్‌ల లైన్లు, నెట్‌వర్క్‌ను వాడుకొని వేరే డిస్కమ్‌లు వ్యాపారం చేసుకునే వెసులుబాటు. విద్యుత్ నియంత్రణ మండళ్ల(ఈఆర్‌సీ) సుమోటోగా చార్జీలు ఖరారు చేసే అధికారం. క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ రద్దు. ఇవీ.. విద్యుత్ పంపిణీ రంగంలో కీలక సంస్కరణలను ప్రతిపాదిస్తూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ తెచ్చిన ముసాయిదా బిల్లు (విద్యుత్(సవరణ) బిల్లు-2025)లోని ముఖ్యాంశాలు. దీన్ని రాష్ట్రాలకు పంపిన కేంద్రం, నెల రోజుల్లోగా అభిప్రాయం తెలియజేయాలని కోరింది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. టెలికం రంగంలాగే విద్యుత్ పంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయి. మరీ ముఖ్యంగా.. ఒక ప్రాంతంలో ఒకే నెట్‌వర్క్‌ను బహుళ విద్యుత్ పంపిణీ వ్యవస్థలు వాడుకునే వీలు కల్పించే ప్రతిపాదన అమల్లోకి వస్తే..

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## వైసీపికి కొత్త వ్యూహకర్తలు

**విజయవాడ-సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** 2024 ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత, జగన్ ఇప్పుడు పూర్తిగా కొత్త దిశలో ఆలోచిస్తూ, పార్టీ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు. గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ, ప్రజల మధ్య తిరిగి విశ్వాసం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ దిశగా ఆయన కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. తాజా సమాచారం ప్రకారం, జగన్ తన పార్టీకి కొత్త వ్యూహకర్తను నియమించే నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఐ-ప్యాక్ బృందంలో ప్రశాంత్ కిశోర్ తో కలిసి పనిచేసిన ఒక అనుభవజ్ఞుడు ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీకి కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్నాడు. ఈ ఒప్పందం 2029 ఎన్నికల వరకు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. 2019లో ప్రశాంత్ కిశోర్ సూచనలతో భారీ విజయం సాధించిన

- మిగతా 2లో..



## 14 ఏళ్ల బాలుడికి.. 28 ఏళ్ల వ్యక్తి గుండె

(మొదటిపేజీ తరువాయి)

గుండె మార్పిడి శస్త్రచికిత్స నిమిత్తం జీవన్‌దాన్ పోర్టల్‌లో ఈ బాలుడి పేరు నమోదు చేశారు. ఈ క్రమంలో గుంటూరులో ఓ వ్యక్తి బ్రెయిన్ డెడ్‌కు గురై అవయవదానానికి సిద్ధంగా ఉన్నారనే విషయం తెలుసుకున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి వారితో సంప్రదించి.. తన బృందంతో గుంటూరు చేరుకున్నారు. కిమ్స్ ఆస్పత్రి నిర్వాహకుల సూచనమేరకు ప్రభుత్వం ప్రత్యేక అంబులెన్సులు, ప్రత్యేక విమానం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో విజయకృష్ణ నుంచి గుండె సేకరించి గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక విమానంలో శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి తిరుపతికి తరలించారు. దాదాపు 6 గంటలు శ్రమించిన వైద్యులు గుండెమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.ద

## ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీలది ఫ్యూడల్ భావజాలం: మల్లికార్జున ఖర్గే

(మొదటిపేజీ తరువాయి)

సిజెఐపై చెప్పును విసరబోయిన ఘటన కానీ, రారుబరేలీలో దొంగ అనుకుని దళిత వ్యక్తిని కొట్టి చంపిన ఘటన కానీ, తాజాగా దళిత ఐపిఎస్ అధికారి పురాన్ కుమార్ ఆత్మహత్య కానీ పరిశీలిస్తే ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీల ప్రమాదకరమైన ఫ్యూడల్ మనస్తత్వాన్ని తెలియజేస్తున్నాయి అని శుక్రవారం ఎక్స్ పోస్టులో ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాగా, నరేంద్ర మోడీ పాలనలో 2013 నుంచి 2023 వరకు ఆదివాసీలు, దళితులపై నేరాల శాతం పెరిగింది. దళితులపై 46 శాతం, ఆదివాసీలపై 91 శాతం నేరాలు పెరిగినట్లు ఎన్‌సిఆర్‌బి (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) నివేదిక తెలియజేసింది అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. తాజాగా కులవివక్ష వల్ల ఐపిఎస్ అధికారి, వేధింపులతో రారుబరేలీలో హరిఓం వాల్మీకి, సిజెఐపై చెప్పుతో చేయబోయిన దాడి, గురువారం బీజేపీ అధికారంలో ఉన్న రాజస్థాన్ సవాయి మాధోపూర్ జిల్లాలో వృద్ధ దళిత మహిళ కమలాదేవి రారుగర్ తన కాళ్లకు ఉన్న వెండి చీలమండల్ని తీసుకోవడానికి ఆమెను దారుణంగా కొట్టినది గానీ ఇటీవల జరిగిన ఈ వరుస సంఘటనలన్నీ పరిశీలిస్తే కేవలం వేర్వేరు సంఘటనలు కాదు.. అవి ఆర్‌ఎస్‌ఎస్- బీజేపీ ఫ్యూడల్ మనస్తత్వం యొక్క ప్రమాదాన్ని తెలియజేస్తున్నాయి. ఈ సంఘటనలు భారత రాజ్యాంగంలోని సామాజిక న్యాయం, సమానత్వం అనే ప్రాథమిక సూత్రాలపై దాడిని ప్రతిబింబిస్తాయి. దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీలు, అణగారిన వర్గాలను బెదిరించడం, అణచివేయడం వంటి రాజకీయాలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయి. రాజ్యాంగం ద్వారానే భారతదేశం పరిపాలించబడుతుంది. తీవ్రవాద భావజాలం యొక్క ఆదేశాల ద్వారా కాదు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు, బలహీన వర్గాలు ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిల భావజాలంతో దాడులకు గురవుతున్నారు. వారెంతో నలిగిపోతున్నారు. మీరు (బిజెపి నేతలు) మీ సొంత కళ్లజోడు పెట్టుకుని.. అసలు సమస్యల్ని చూడలేకపోతున్నారు అని ఖర్గే ఎక్స్ పోస్టులో ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## సంక్రాంతి నాటికి డీఎస్సీ

(మొదటిపేజీ తరువాయి)

టీచర్ పోస్టులను భర్తీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టెట్, డిఎస్సీలకు అభ్యర్థులంతా సన్నద్ధం కావాలి సూచించారు. కొత్త డిఎస్సీ నిర్వహణ తర్వాత వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రణాళిక అమలు చేస్తామన్నారు లోకేష్. 2026 జనవరిలో నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ, స్పెషల్ డిఎస్సీ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలపై లక్ష్యసాధనకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. బేస్ లైన్ టెస్ట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 78మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను మెరుగైన విద్యాప్రమాణాలపై అధ్యయనానికి సింగపూర్ పర్యటనకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికే ఈ ఏడాది ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏప్రిల్ 20న 16వేలకుపైగా పోస్టులతో తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి రోజే డీఎస్సీ నియామక నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి సంతకం చేశారు. కానీ రిజర్వేషన్ల అంశం ఇతర న్యాయ సమస్యలను పరిష్కరించుకొని ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వచ్చింది. ఏప్రిల్‌లో వచ్చిన నోటిఫికేషన్‌కు జూన్‌లో పరీక్షలు పెట్టారు. నెల రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు. అక్కడికి నెల రోజుల తర్వాత ఫలితాలు విడుదల చేసి నియామక ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అమరావతిలో వేడుకగా కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలను కూడా అందజే?శారు. ఆ టైంలోనే ఏటా డీఎస్సీ ఉంటుందని నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ వేస్తున్నామని మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అన్నట్టుగానే అందుకు తగ్గ కార్యచరణ చేపట్టాలని అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. మొన్న నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులు, ఇంకా వివిధ పాఠశాలల్లో ఉన్న ఖాళీల గుర్తించాల్సి ఉంది. ఈసారి భారీ స్థాయిలో పోస్టులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

**భారీగా పోలీసుల నియామాకాలు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగులకు త్వరలోనే గుడ్‌న్యూస్ అందించే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్రంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఖాళీలను భర్తి చేసేందుకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వు, ఏపీఎస్‌సీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో.. ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసు విభాగంలో ఖాళీల వివరాలకు సంబంధించిన లేఖను ఇప్పటికే డీజీపీ.. ప్రభుత్వానికి పంపించారు. ఆ వివరాలు పరిశీలించిన తర్వాత ప్రభుత్వం అనుమతి ఇస్తే.. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.రాష్ట్ర ప్రభుత్వానికి డీజీపీ కార్యాలయం పంపించిన లేఖలో ఖాళీల వివరాలను ప్రస్తావించింది. ఈ ఏడాది? ఆగస్టు 31వ తేదీ వరకు ఉన్న ఖాళీలని అందులో వెల్లడించారు. దాని ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలో.. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఈ పోస్టుల నియామకాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని ప్రభుత్వానికి రాసిన లేఖలో డీజీపీ పేర్కొ?న్నారు. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో నేరాలు పాల్పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్టం చేయాలంటే.. పోలీస్ ఫోర్స్ అవసరమని అన్నారు. అందుకోసం ఖాళీలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా నిరుద్యోగుల గరిష్ఠ వయోపరిమితి పెంచింది. న్-యూనిఫాం సర్వీస్‌ల్లో పోస్టులకు.. గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

# వైసీపికి కొత్త వ్యూహకర్తలు

(మొదటిపేజీ తరువాయి)

జగన్, ఇప్పుడు అదే అనుభవాన్ని మరో వ్యూహకర్త ద్వారా వినియోగించుకోవాలని భావిస్తున్నారు.జగన్ దృష్టి ఇప్పుడు పూర్తిగా పార్టీ కేడర్ బలోపేతంపైనే ఉంది. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో ప్రత్యక్షంగా కలుసుకో వడం, నాయకుల మధ్య సమన్వయం పెం పొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కొత్త వ్యూహం కింద, ఆయన త్వరలో ప్రజల్లోకి వెళ్లే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలముందు ఎండగట్టే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పీపీపీవిధానంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై జగన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు.ఇదే సమయంలో అధికార కూటమి కూడా తన వ్యూహాలను మరింత బలంగా మలుచుకుంటోంది. ప్రశాంత్ కిశోర్, రాబిన్ శర్మ వంటి వ్యూహకర్తలు టీడీపీ?జనసేన?బీజేపీ కూటమికి మార్గనిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. దీంతో జగన్ కొత్త వ్యూహకర్త, కూటమి వ్యూహకర్తల మధ్య ఆలోచనా పోరు ఆసక్తికరంగా మారనుంది.ఈ చర్యలన్నీ 2029 సార్వత్రిక ఎన్నికల దిశగా జగన్ తీసుకుంటున్న సన్నాహక క్రమంలో భాగంగా కనిపిస్తున్నాయి. పార్టీ పునరుత్థానం కోసం తీసుకుంటున్న ఈ వ్యూహాత్మక అడుగులు విజయవంతమైతే, రాష్ట్ర రాజకీయ సమీకరణాల్లో పెద్ద మార్పులు చోటుచేసుకోవచ్చు. ప్రజల్లో తిరిగి పట్టు సాధించడం, వైఎస్‌ఆర్‌సీపీకి నూతన ఉత్సాహాన్ని నింపడం జగన్ ప్రధాన లక్ష్యం. రాబోయే నెలల్లో ఆయన నిర్ణయాలు, కొత్త వ్యూహకర్త సూచనలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చలకు దారి తీసే అవకాశం ఉంది.మరో వైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోంది. రుషిరాజ్ సింగ్ నేతృత్వంలోని ఈ బృందం వైసీపీకి ఎన్నికల వ్యూహాన్ని.. రాజకీయ సలహాలను అందిస్తూ వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. దాని వెనుక ఐప్యాక్ టీం ఫెయిల్యూర్ ఉన్నట్లు సొంత పార్టీ నేతలే ఆరోపణలు చేశారు. దీంతో జగన్మోహన్ రెడ్డి ఐప్యాక్ టీం కు గుడ్ బై చెబుతారని ప్రచారం నడిచింది. కానీ ఇప్పటికీ ఐ ప్యాక్ టీం సేవలే కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఐప్యాక్ బృందం నాయకత్వం మారనున్నట్లు ప్రచారం సాగుతోంది. రిషి రాజ్ సింగ్ స్థానంలో ప్రశాంత్ కిషోర్ ప్రధాన సన్నిహితుడు రానున్నట్లు టాక్ నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో ప్రశాంత్ కిషోర్ కు విడదీయరాని బంధం. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు ముంగిట వరకు వచ్చి ఆగిపోయింది. 67 సీట్లతో సరిపెట్టుకుంది. ఈ తరుణంలో జగన్మోహన్ రెడ్డి ఎన్నికల వ్యూహకర్త కోసం అన్వేషించారు. ఎన్నికల వ్యూహంలో ఆరితేరిన ప్రశాంత్ కిషోర్ ను వ్యూహకర్తగా పెట్టుకున్నారు. 2018లో పాదయాత్ర సమయంలోనే పార్టీ శ్రేణులకు స్వయంగా పరిచయం చేశారు ప్రశాంత్ కిషోర్ ను జగన్మోహన్ రెడ్డి. అది మొదలు 2019 ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించే వరకు వారి జర్నీ కొనసాగింది. కానీ అకస్మాత్తుగా ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయవేత్తగా మారిపోయారు ప్రశాంత్ కిషోర్. అయినా సరే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి గౌరవ సలహాలు, సూచనలు అందించారు ప్రశాంత్ కిషోర్.ప్రస్తుతం బీహార్ రాజకీయాల్లో బిజీగా ఉన్నారు ప్రశాంత్ కిషోర్. మొన్న ఆ మధ్యన మంత్రి నారా లోకేష్ ఢిల్లీ వెళ్ళినప్పుడు ప్రశాంత్ కిషోర్ తో చర్చించారు. పలు అంశాలపై వారిద్దరూ మాట్లాడుకున్నారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఇబ్బందుల్లో ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రశాంత్ కిషోర్ ను ఆశ్రయిస్తే.. తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నానని.. తరువాత చూద్దామంటూ దాటవేత ధోరణి చూపించినట్లు తెలుస్తోంది. అయితే రుషిరాజ్ సింగ్ స్థానంలో ప్రశాంత్ కిషోర్ వేరే వ్యక్తి పేరును సూచించినట్లు సమాచారం. త్వరలో ఆయన ఐప్యాక్ బృందానికి సారథ్యం వహిస్తారని కూడా ప్రచారం నడుస్తోంది. దీనిపై త్వరలో క్లారిటీ రానున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# 2047కల్లా ఏపీ నంబర్ 1

(మొదటిపేజీ తరువాయి)

'నందగోకులం సేవ్ ది బుల్' ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, జేసీ పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. మన ముందు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. మనతోపాటు పేద వర్గాలకూ గొప్ప భవిష్యత్ అందించే ఉద్దేశంతోనే పీ-4 కార్యక్రమం ప్రవేశపెట్టానని చెప్పారు. దాని స్ఫూర్తిని కొనసాగించే విషయంలో విశ్వసముద్ర సంస్థ, చింతా శశిధర్ ఫౌండేషన్ సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఇంకా ఏమన్నారంటే..

**ఆర్థిక ఫలాలు పేదలు అందుకోవాలి**

ఆర్థిక ఫలాలు పేదలు అందుకోవాలనేదే నా తపన. అందుకే పీ-4 ప్రవేశపెట్టాను. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు... ఇంతకాలం సమాజం నుంచి తీసుకున్నారు. ఇప్పుడు సమాజానికి ఎంతోకొంత తిరిగిచ్చే సమయం వచ్చింది. మీరు సంపాదించినదానిలో కొంత పేదలకు ఇవ్వండి. పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మారడానికి చేయూతనివ్వండి. శశిధర్ ఫౌండేషన్ చేసిన సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. నందిని లైఫ్ స్కూల్ ఒక అద్భుత పాఠశాల. పేద విద్యార్థులను దత్తత తీసుకుని వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందిస్తున్నారు. ఇలాంటి స్ఫూర్తి కావాలి. ఫౌండేషన్ సేవలు మరింత మందికి ఆదర్శం కావాలి. అప్పుడే పేదరికం లేని సమాజం సాకారం అవుతుంది. విశ్వసముద్ర సంస్థ, శశిధర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం. బయో ఇథనాల్ ప్లాంట్ ద్వారా వాతావరణ సమతుల్యతతోపాటు రైతులకు మేలు జరుగుతుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బయో ఇథనాల్‌ను వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను అందిపుచ్చుకుని ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం. ఇక 'నందిని సేవ్ ది బుల్' ప్రాజెక్టు ఇప్పటి వరకు ఎప్పుడూ, ఎక్కడా చేయని సరికొత్త ఆవిష్కరణ. వారసత్వ సంపదగా మానవ నాగరికతతో బలమైన అనుబంధం కలిగిన ఎడ్ల జాతి అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నప్పుడు వాటి ద్వారా సరికొత్త ఆదాయ మార్గాలను ఈ ప్రాజెక్టు చూపింది. ఎద్దులను ట్రెడ్‌మిల్‌పై నడిపించడం ద్వారా విద్యుదుత్పత్తి చేసే విధానం అద్భుతం. బహుశా ఇలాంటి ప్రయోగం ఇప్పటి వరకు ఎక్కడా జరిగి ఉండదు. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ.. మరోవైపు పశుజాతి సంరక్షణ.. ఇంకోవైపు పేద విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందిస్తున్న చింతా శశిధర్ ఫౌండేషన్‌ను ప్రభుత్వం తరపున అభినందిస్తున్నా.

### మూడో తరగతి విద్యార్థులకు ఏఐలో తర్ఫీదు..

'ఈ రోజు ఇక్కడ చింతా శశిధర్ ఫౌండేషన్ స్థాపించిన స్కూలును చూశాను. మూడో తరగతి విద్యార్థులు మిషన్ మెకనైజేషన్, ఏఐలో తర్ఫీదు పొందుతున్నారు. భవిష్యత్‌పై నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం చూసి నాకు ధైర్యం వచ్చింది. రాబోయే తెలుగు తరాల పిల్లలు ప్రపంచ సాంకేతిక రంగాన్ని శాసిస్తారు. ఇందులో ఎలాంటి అనుమానమూ లేదు.

# ఇక డిస్కమ్‌ల పోటీ

(మొదటిపేజీ తరువాయి)

బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో, ఐడియా, వోడాఫోన్ కంపెనీలు పోటీ పడ్డట్టుగా.. డిస్కమ్‌లు ఇంటింటికీ తిరిగి తమ కనెక్షనే తీసుకోవాలంటూ నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకే ఆఫర్ చేసే అవకాశాలున్నాయి. ఇంగ్లండ్‌లాంటి దేశాల్లో ఈ విధానం ఇప్పటికే అమల్లో ఉంది. గతంలో ల్యాండ్‌లైన్ టెలిఫోన్ కనెక్షన్ తీసుకోవాలంటే విధిగా లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కరెంట్ కనెక్షన్‌కూ అదే పరిస్థితి. దరఖాస్తు చేసుకున్నా.. రకరకాల కారణాలతో కరెంట్ కనెక్షన్ ఇవ్వకుండా తిప్పడం చాలా మంది విద్యుత్ సిబ్బందికి అనవాయితీగా మారింది. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే డిస్కమ్‌ల మధ్య పోటీ పెరిగి.. సిబ్బంది మన ఇంటికే వచ్చి తక్కువ ధరకే కనెక్షన్ ఇస్తామని ఆఫర్ చేసే అవకాశాలున్నాయి. అలాగే.. ముసాయిదా బిల్లు ప్రకారం ఒక యూనిట్‌కు అయ్యే వ్యయాన్ని పూర్తిస్థాయిలో డిస్కమ్‌లు వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. సబ్సిడీ ఇవ్వదలుచుకుంటే నేరుగా ప్రభుత్వం వినియోగదారుడి ఖాతాలో జమచేయాలి. లేదంటే ప్రత్యేకంగా ఒక ఖాతాను తెరిచి.. డిస్కమ్‌ల అకౌంట్‌లో జమచేయాల్సి ఉంటుంది. ముసాయిదాలోని మరో ముఖ్యమైన ప్రతిపాదన.. తయారీ రంగం, రైల్వే, మెట్రోలను క్రాస్ సబ్సిడీ భారం నుంచి ఐదేళ్లలోగా మినహాయించడం. క్రాస్ సబ్సిడీలంటే.. పరిశ్రమల వంటివాటికి సరఫరా చేసే విద్యుత్‌కు ఎక్కువ చార్జీలు వసూలు చేసి, ఆ ఆదాయంతో పేదలకు, రైతులకు రాయితీ ధరలకు విద్యుత్ సరఫరా చేయడం. ఈ క్రాస్ సబ్సిడీల భారం నుంచి తయారీ రంగాన్ని, రైల్వే, మెట్రోలను మినహాయించడం అంటే.. అవి విద్యుత్‌కు అధిక చార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

**టారిఫ్ పిటిషన్ ఇవ్వకపోతే..**

విద్యుత్ టారిఫ్‌లను సుమోటోగా సవరించే అధికారాన్ని రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ సంస్థ (ఈఆర్‌సీ)లకు కల్పించే ప్రతిపాదన ఈ బిల్లులో ఉంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం టారిఫ్‌లను సవరించాలంటే.. విద్యుత్ పంపిణీ సంస్థలు టారిఫ్ పిటిషన్‌ను ఈఆర్‌సీకి సమర్పించాల్సి ఉంటుంది. అందులో డిస్కమ్‌లు సమర్పించిన వివరాల ఆధారంగా.. ఆధారంగా ఈఆర్‌సీలు ప్రజాభిప్రాయాన్ని సేకరించి, అన్ని విధాలా సమీక్షించి కొత్త చార్జీలను నిర్ణయిస్తాయి. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల కారణాల వల్ల (ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెరగడం ఇష్టం లేకనో, మరేవైనా రాజకీయకారణాలతోనో) డిస్కమ్‌లు టారిఫ్ పిటిషన్లను ఈఆర్‌సీకి సమర్పించకుండా ఆపుతాయి. ఫలితంగా చార్జీలు పెరగవుగానీ వ్యయాలు.. డిస్కంల నష్టాలు మాత్రం ఏటికేడాదీ పెరిగిపోతుంటాయి. అందుకే కేంద్రం ఈ ముసాయిదా బిల్లులో ఈఆర్‌సీలకు సుమోటోగా టారిఫ్‌లను సవరించే అధికారాన్ని కల్పించే ప్రతిపాదనను చేర్చింది. దీనివల్ల.. డిస్కమ్‌లు టారిఫ్ పిటిషన్లను సమర్పించకపోయినా ఈఆర్‌సీలు సొంతంగా నిర్ణయం తీసుకుని ఏటా ఏప్రిల్ 1 (ఆర్థిక సంవత్సరం మొదటిరోజు) నుంచి కొత్త టారిఫ్‌లు అమలయ్యేలా చూసే వీలుంటుంది. విద్యుత్ రంగంలో పాలసీలపై చర్చించడానికి వీలుగా జాతీయ స్థాయిలో కేంద్ర విద్యుత్ మంత్రి చైర్మన్‌గా ఎలక్ట్రిసిటీ కౌన్సిల్ ఏర్పాటు అవుతుంది. ఇందులో రాష్ట్రాల విద్యుత్ మంత్రులు సభ్యులుగా ఉంటారు. విధాన నిర్ణయాలపై సూచనలు, సలహాలు తీసుకోవడానికి ఈ కౌన్సిల్ ఉపయుక్తంగా ఉంటుంది.

### మారిన లెక్కలు..

ప్రస్తుతం విద్యుత్ చౌర్యం కేసులో ఒక వినియోగదారుడిని పట్టుకుంటే... గరిష్ఠ వినియోగం ఆధారంగా రెండేళ్లు, మూడేళ్లు, నాలుగేళ్లు.. ఇలా ఇష్టం వచ్చిన కాలానికి డిస్కమ్‌లు జరిమానాలు వేస్తున్నాయి. ఇక ముందు అలా కుదరదు. ఆ వినియోగదారుడు ఎన్నేళ్లుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నా.. గరిష్ఠంగా ఏడాది కాలానికి మాత్రమే జరిమానాలు వేయాల్సి ఉంటుంది. ఈఆర్‌సీలు ఏ కేసునైనా నిర్దిష్టంగా నాలుగు నెలల్లోపు తేల్చాలి. ఒక మెగావాట్ కన్నా ఎక్కువ వినియోగం ఉన్న వినియోగదారులు డిస్కమ్ నుంచి లేదా ఓపెన్ యాక్సెస్‌లో నేరుగా కరెంట్ కొనుగోలు చేసే అవకాశం ఉంది.

# ట్రంప్ నోబెల్ ఆశలు ఆవిరి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సారి నోబెల్ శాంతి బహుమతి ప్రకటనపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ఎందుకంటే.. ఈ సారి ఈ అత్యున్న పురస్కారాన్ని ఆశించిన వారిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఉండటమే. ఎనిమిది యుద్ధాలను నివారించిన తనకే నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ ట్రంప్ ఇటీవలి కాలంలో అనేక ప్రకటనలు చేశారు. దానిపై ఎన్నో ఆశలూ పెట్టుకున్నారు. తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ రష్యా, ఇజ్రాయిల్, పాక్ సహా పలు దేశాలతో నామినేట్ కూడా చేయించుకున్నారు. తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోతే అమెరికాకే అవమానమని వ్యాఖ్యలూ చేశారు. ట్రంప్ అంతటితో ఆగకుండా.. మాజీ అధ్యక్షుడు ఒబామా పైనా అక్కసు వెళ్లగక్కారు. ఎనిమిది యుద్ధాలు ఆపిన తనకు నోబెల్ శాంతి బహుమతి రావటంపై స్పష్టత లేనప్పటికీ.. ప్రపంచం కోసం ఏమీ చేయకపోయినా ఒబా మాకు నోబెల్ బహుమతి ఇచ్చారంటూ అసం తృప్తిని వెలిబుచ్చారు. ఒకపక్క ఆశ, మరోపక్క అసంతృప్తి నడుమ నోబెల్ కమిటీ తాజాగా శాంతి బహుమతిని వెనిజులా నేతకు ప్రకటిం చింది. ట్రంప్‌ను ఏ మాత్రమూ పరిగణలోకి తీసుకోలేదు. దీంతో అమెరికా అధ్యక్షుడికి మరోసారి నిరాశే ఎదురైంది.కాగా ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వకపోవడంపై అమెరికా అధ్యక్ష భవనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నోబెల్ కమిటీకి శాంతి కంటే రాజకీయాలే ఎక్కువయ్యాని వ్యాఖ్యా నించింది. "నోబెల్ రాకపోయినా ట్రంప్ శాంతి ఒప్పందాలు కుదురు స్తారు. యుద్ధాలను నివారిస్తారు. ప్రజల ప్రాణాలు కాపాడతారు. తన మనోబలంతో పర్వతాలను సైతం కదిలించగలిగిన ట్రంప్ వంటి వ్యక్తి మరొకరు ఉండరు" అని అధ్యక్ష భవనం ప్రతినిధి స్టీవెన్ చుంగ్ చెప్పుకొచ్చారు.

**ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా విజేతలను ఎంచుకుంటాం : నోబెల్ కమిటీ**

అమెరికా అధ్యక్ష భవనం నుంచి తీవ్ర అసంతృప్తి, ఆరోపణలు రావటంతో నోబెల్ కమిటీ నుంచి స్పందన వచ్చింది. ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి రాలేదని అక్కసు వెళ్లగక్కిన నేపథ్యంలో నోబెల్ కమిటీ చైర్మెన్ జొర్గెన్ వాట్నె ఫ్రిడ్నెస్ వివరణ ఇచ్చారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ ఆకాంక్షలకు అనుగుణంగా నోబెల్ బహుమతులు ప్రకటిస్తామే తప్ప ట్రంప్ వాదనలను బట్టి కాదని స్పష్టం చేశారు. నోబెల్ కమిటీ మీడియా, బహిరంగ ప్రచారాలను నిరంతరం గమనిస్తుంటుందనీ, నోబెల్ గ్రహీతల చిత్రాలు ఉన్న గదిలో కూర్చొని ఆ లేఖలను మేం చూస్తామని వివరించారు. ఆ గది తమకు ధైర్యాన్నిస్తుం దనీ, సమగ్రతతో పని చేసే సంకల్పాన్ని కలిగిస్తుందని చెప్పారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా తాము నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు. కాగా ఇప్పటి వరకు నోబెల్ శాంతి బహుమతులు పొందిన అమెరికా అధ్యక్షులు నలుగురు మాత్రమే ఉన్నారు. వారిలో థియోడోర్ రూజ్‌వెల్ట్ (1906), వుడ్‌రో విల్సన్ (1919), జిమ్మీ కార్టర్ (2002), బరాక్ ఒబామా (2009)లు ఈ జాబితాలో నిలిచారు.

## సంపాదకీయం

### మరి తమిళనాడులో 69% రిజర్వేషన్లు ఎలా

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. న్యాయస్థానాల ముందు ఈ విషయంలో పోరాడాల్సిన పరిస్థితి ఉంది. ఇందుకు కారణం, ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధానమైనది. రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలు లేదు అని ఆ కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు, తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న 42 శాతం రిజర్వేషన్ల అమలును మోకాలొడ్డుతోంది. అయితే, తమిళనాడు రాష్ట్రంలో మాత్రం 50 శాతం మించి రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. 1. తమిళనాడులో ప్రస్తుతం 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:2. వెనుకబడిన తరగతులు 30%(దీనిలో బీసీ ముస్లింలకు 3.5% అంతర్గత రిజర్వేషన్ ఉంది)3. అత్యంత వెనుకబడిన తరగతులు/డీనోటిఫైడ్ కమ్యూనిటీలు – 20%4. షెడ్యూల్డ్ కులాలు – 18%షెడ్యూల్డ్ తెగలు – 1% మొత్తం రిజర్వేషన్లు – 69%తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల అమలు వెనుక సుదీర్ఘమైన చరిత్ర ఉంది. అక్కడి సామాజిక న్యాయ పోరాటం, అక్కడి రాజకీయ నేతలలో ఉన్న సంకల్పం, చట్టపరమైన వ్యూహాలను వారు అనుసరించడం వల్ల 50 శాతం మించి రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యమైంది. ఈ పూర్వాపరాల్లోకి వెళితే, తమిళనాడుపై ద్రవిడ ఉద్యమ ప్రభావం అంతా ఇంతా కాదు. ఈ రిజర్వేషన్ల డిమాండ్ చరిత్ర 1920ల నుంచి ఉంది. దీని లక్ష్యం ఒక్కటే: బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యత కల్పించడం.భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మద్రాస్ రాష్ట్రంలో రిజర్వేషన్లు క్రమక్రమంగా పెరగడం ప్రారంభించాయి. 1971ల నాటికి అప్పటి డీఎంకే ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 25 శాతం నుంచి ఒక్కసారిగా 31 శాతానికి పెంచింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 16 నుంచి 18 శాతానికి పెంచింది. దీంతో 1971ల నాటికి తమిళనాడు రాష్ట్రంలో రిజర్వేషన్లు 49 శాతానికి చేరాయి. ఆ తర్వాత 1980ల నాటికి ఎంజీ రామచంద్రన్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 31 శాతం నుంచి 50 శాతానికి పెంచడం జరిగింది. దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీల మొత్తం రిజర్వేషన్ల శాతం 68 శాతానికి చేరింది. ఆ తర్వాత 1989లో డీఎంకే ప్రభుత్వం గిరిజనులకు ప్రత్యేకంగా మరో 1 శాతం రిజర్వేషన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకుంది .( అంతకు ముందు ఎస్సీ,ఎస్టీలకు కలిపి రిజర్వేషన్లు ఉండేవి) ఇలా తమిళనాడులో రిజర్వేషన్ శాతం 69 శాతానికి చేరింది.అప్పటి వరకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోన్న తమిళనాడు ప్రభుత్వానికి, 1992లో ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు) లో సుప్రీం కోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అరుదైన, అసాధారణ పరిస్థితుల్లో తప్ప దేశంలో రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని తీర్పులో పేర్కొంది. ఇది తమిళనాడులో అప్పటికే అమలు అవుతున్న 69 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉంది. అయితే, 69 శాతం రిజర్వేషన్లను యథావిధిగా అమలు చేసేందుకు తమిళనాడు రాజకీయ నేతలు రాజకీయ చతురతను ప్రదర్శించారు. నాటి తమిళనాడు సీఎం జయలలిత వ్యూహాత్మకమైన తీరులో వ్యవహరించింది.ఇందిరా సాహ్నీ కేసు తీర్పుతో తమిళనాడు రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయి. దీంతో జయలలిత ప్రభుత్వం తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని తెచ్చింది. 1994 తమిళనాడు శాసన సభలో చట్టం – 45 ను ఆమోదించింది. ఈ చట్టం రాష్ట్రంలోని విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది ప్రధాన లక్ష్యం. ఆ తర్వాత 69 శాతం రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ రక్షణ కల్పించే దిశగా అడుగులు వేసింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో 69 శాతం రిజర్వేషన్ల అమలును జయలలిత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సాయంతో చేర్పించగలిగింది. ఇందుకు 1994లో 76వ రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో 69 శాతం తమిళనాడు రిజర్వేషన్ల అంశాన్ని చేర్చడం జరిగింది. ఈ షెడ్యూల్‌లో చేరిన చట్టాలపై న్యాయస్థానాలు సమీక్షించలేవు. ఇలా తమిళనాడు రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించబడింది. ఈ కారణంగా, రిజర్వేషన్లు 50 శాతం పరిమితి దాటకూడదని సుప్రీం తీర్పు ఇచ్చినప్పటికీ, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి.రాజకీయ బేరసారాలు: ఈ రాజ్యాంగ సవరణను చేయించడానికి అప్పటి ముఖ్యమంత్రి జయలలిత, కేంద్రంలో పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై గట్టి రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చారు. తమిళనాడులో కాంగ్రెస్–ఏఐఏడీఎంకే కూటమి బలమైనదికావడంతో, ఈ రాజ్యాంగ సవరణకు అప్పటి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వక తప్పలేదు. రాజకీయ అనివార్యత కారణంగానే 1994లో 76వ రాజ్యాంగ సవరణ చేసి తమిళనాడు రిజర్వేషన్ చట్టం ను 9వ షెడ్యూల్‌లో చేర్చడం జరిగింది.జయలలిత ఒత్తిడికి తలొగ్గిన పీవీ: 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ – అన్నాడీఎంకే తమిళనాడులో పొత్తు పెట్టుకుని అద్భుత ఫలితాలను సాధించాయి. ఆ సమయంలో ప్రధానిగా ఉన్న పీవీ నరసింహారావు పార్లమెంట్‌లో తన ప్రభుత్వ మెజార్టీ కోసం అన్నాడీఎంకే మద్దతుపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఏ మాత్రం జయలలిత కినుక వహించినా పీవీ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి. ఈ కారణంతో తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని జయలలిత పీవీపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఈ కారణంతో పీవీ నరసింహారావు ప్రభుత్వం జయలలిత ఒత్తిడి మేరకు తమిళనాడు రిజర్వేషన్ల చట్టానికి 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా రాజ్యాంగ రక్షణ కల్పించింది. అంతే కాకుండా, తమిళనాడు ద్రవిడ ఉద్యమంతో ముడిపడి ఉన్న రిజర్వేషన్ విధానం. ఇది చాలా కాలం నుంచి అమల్లో ఉంది. దీనికి వ్యతిరేకంగా ఏం జరిగినా ఆ రాష్ట్రంలో పెద్ద స్థాయిలో ఉద్యమం చెలరేగవచ్చు అన్న భావనతో కేంద్రం తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చక తప్పలేదు.

# నవంబర్ నుంచి బంగారం తవ్వకాలు

**కర్నూలు, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** రాయి రాయి అన్నది ఒకనాటికి రత్నమవునురా. బంగారం లాంటి ఈ మాట ఇప్పుడు రాయలసీమలో బంగారం ఉత్పత్తికి బాటలేసింది. ఇన్నాళ్లు నెర్రలు బాసిన నేలలో ఇప్పుడు ఇక కనకధారే. అవును.. కరువుకు కేరాఫ్‌గా నిలిచిన కర్నూలు సీమ ఇప్పుడు ఆత్మనిర్భర్ భారత్‌కు సిరుల సిగ కాబోతోంది. కర్నాటక గోల్డ్ ఫీల్డ్‌ను మించి తుగ్గలి మండలంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్‌లో భారీ మైనింగ్‌కు రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్ట మొదటి అతిపెద్ద ప్రవేటు గోల్డ్ మైన్‌గా కర్నూలు రికార్డు క్రియేట్ చేయబోతుంది. తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామంలో గోల్డ్ మైనింగ్ ప్రారంభిస్తున్నట్టు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. పసిడి ధరలు రికార్డు స్థాయిలో ఆకాశన్నంటుతున్న వేళ డెఫినెట్‌గా ఇది బంగారంలాంటి మాటే. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు దేశంలో అతిపెద్ద ఫస్ట్ ప్రయివేటు గోల్డ్ మైన్ ఇదే.వానొస్తే కర్నూలు జిల్లా తుగ్గలి, పగిడిరాయి, తుగ్గలి, జొన్నగిరి సహా చుట్టుపక్కల గ్రామాల్లో వజ్రాలవేట జోరుగా సాగేది. అంతేకాదు నెర్రలు బాసిన ఈ నేలలో బంగారు నిక్షేపాలున్నాయని పరిశోధనల్లో తేలింది. అలా తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామం దగ్గర జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. బంగారం, వెండి వంటి ఖనిజాల



వెలికితీతలో ఎంతో అనుభవం వున్న త్రివేణి త్రివేణి ఎర్త్ మూవర్స్, లాయ్‌లాడ్స్ మెటల్ అండ్ ఎనర్జీ లిమిటెడ్, దక్కన్ గోల్డ్ మైన్స్ భాగస్వామ్యంతో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ రాయలసీమలో సువర్ణ శకానికి తెరలేచింది.జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 70 శాతంతో ప్రధాన వాటాదారులైన త్రివేణి సంస్థ ఎండీ ప్రభాకరన్ ? జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ త్వరలో మైనింగ్ చేపడుతామని ప్రకటించారు. ఏడాదికి 500 కేజీల ఉత్పత్తి లక్ష్యంగా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఏటా టన్ను బంగారం ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్దంచేసినట్టు చెప్పారాయన. భవిష్యత్తులో ఇక్కడ బంగారం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత కొత్తగా నిర్మించిన ప్లాంట్‌లో ట్రయల్ రన్ కొనసాగుతుందన్నారు. భారత్ ఆత్మనిర్భర్ సంకల్పానికి జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ బాసటగా నిలుస్తుందన్నారు. బంగారం ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతగా పరిసర గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తామ ప్రాజెక్ట్ చేయూతనిస్తుందన్నారు ప్రభాకరన్. భూములిచ్చిన రైతు కుటుంబాలకు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

# తలనొప్పిగా మారుతున్న తమ్ముళ్ల తన్నులాటలు

**అనంతపురం, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఉమ్మడి అనంతపురం జిల్లా లోని కొన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. అధికార పార్టీ అయినప్పటికీ నాయకుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ధర్మవరం , రాప్తాడు వంటి నియోజకవర్గాల్లో పార్టీ లోపలకే సమస్యలు ఏర్పడుతున్నాయి. అయితే ఇప్పటివరకు వీరి మధ్య అనుకున్నంత పెద్దగా సవాళ్లు కనిపించవు.తాజాగా రాయదుర్గం నియోజకవర్గంలో కాల్వ శ్రీనివాసులు పై పార్టీ లోపల విమర్శలు వినిపించాయి. శ్రీనివాసులు సీనియర్ నేత, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్నారు. తన రాజకీయ చరిత్రలో సౌమ్యుడనే పేరు తెచ్చుకున్నాడు, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు. తన సామాజిక వర్గానికి మాత్రమే కాకుండా, అన్ని వర్గాల వారిని కలుపుతూ ముందుకు వెళ్తూ అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.కానీ, ఇటీవల ఆయనపై సొంత పార్టీలో కొన్ని విమర్శలు వచ్చాయి. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పాత ఘర్షణలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అధికారపక్షం లోపలే విభేదాలు పెరుగుతున్నాయి.. ఇది స్థానిక రాజకీయ వాతావరణంలో టిడిపి నాయకులకు సవాలు గా మారింది. ఇక ఈ లక్షలు మరీ ఎక్కువ కావడంతో లోకల్ గా కూడా “ఎంతకాలం ఈ గొడవలు?” అనే విమర్శలు వినిపిస్తున్నాయి.వైసీపీ నాయకులు, ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విషయంలో టిడిపి అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు కాస్త తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. రాజకీయంగా కేవలం దూకుడే ఫలితాన్ని ఇవ్వదు. స్థానిక పరిస్థితులు, ప్రజల ఆలోచనలు, సమాజ మార్పులను అర్థం చేసుకుని నాయకులు సరైన వ్యూహాలను రూపొందించుకోవాలి. అలా కాకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.ఇక చంద్రబాబు నాయుడు ఈ సమస్యపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం కూడా వార్తల్లో వినిపిస్తోంది. కానీ, స్థానిక రాజకీయ దృష్ట్యా ఇది సరైన పరిణామం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలను సమర్ధవంతంగా సర్దుమణిగే విధంగా ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, స్థానిక స్థాయిలో సమైక్యత సాధించడానికి చర్యలు అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు.మొత్తానికి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నియోజకవర్గాల్లో నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, సవాళ్లను సానుకూలంగా పరిష్కరించే ప్రయత్నాలు ఇప్పటి వరకు లేకపోవడం రాజకీయ వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. టిడిపి నాయకులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోవాలి అని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

# నోరు జారుతున్న మంత్రులు

**హైదరాబాద్, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** తెలంగాణ మంత్రుల మాటలు మంటలు రేపుతున్నాయి. పరుష పదజాలంతోనూ, అనాలోచితంగా చేసే వ్యాఖ్యలు పార్టీకి ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ఈ తరహా వ్యాఖ్యలు మంత్రుల మధ్య విబేధాలు సృష్టిస్తుంటే, ఇక ముఖ్యమంత్రి (సీఎం) చేసిన వ్యాఖ్యలను ఏకంగా సుప్రీంకోర్టే తప్పుబట్టింది. అందుకే నాలుకను ‘రెండు అంచుల ఖడ్గం’గా చెబుతారు. అది పక్క పార్టీ వాళ్లనే కాదు, సొంత పార్టీ వాళ్లను కూడా ఖండించేయగల శక్తిగలది. అయితే, తెలంగాణలో ఈ మాటలు రేపుతున్న చిచ్చు ఏంటో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం. ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మధ్య మాటల యుద్ధానికి తెరలేచింది. అయితే, ఆ కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చిన తనను పొన్నం ఒక జంతువుతో పోల్చి అమర్యాదగా మాట్లాడారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పొన్నం తీరుపై మండిపడ్డారు. అయితే, తాను అడ్లూరిని ఏమీ అనలేదని, ఢిల్లీ పర్యటనకు టికెట్ బుక్ చేయని తన సిబ్బందిని ప్రస్తావిస్తూ ఆ పదం వాడానని పొన్నం వివరణ ఇచ్చారు.అయితే, ఇది ఇంతటితో ఆగలేదు. మరో మంత్రి వివేక్ కూడా తన పక్కన కూర్చోవడానికి ఇష్టపడడం లేదని, అందుకు కారణం తాను వచ్చిన సామాజిక వర్గమే అని అడ్లూరి హాట్ కామెంట్ చేయడం జరిగింది. ఈ వివాదం చివరకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వరకు చేరింది. ఇద్దరూ ఈ విషయాన్ని మరిచిపోయి కలిసి పని చేయాలని ఆయన చెప్పినా, ఈ విషయంలో పొన్నం తనకు క్షమాపణ చెప్పాలని మంత్రి అడ్లూరి డిమాండ్ చేశారు. అయితే, మంత్రి అయినా, తన సిబ్బంది అయినా ఒక జంతువుతో పోల్చి తిట్టడం మాత్రం అనైతికమని పొన్నం వ్యాఖ్యలను నెటిజన్లు తప్పుబడుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన తొందరపాటు వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక వర్గాల మధ్య వివాదంగా మారాయి. అయితే, దీన్ని హస్తం (కాంగ్రెస్) పెద్దలు ఎలా కట్టడి చేస్తారో వేచి చూడాలి.నాగార్జున సాగర్ పర్యటన కోసం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, మరో ఇద్దరు మంత్రులు హెలికాప్టర్‌లో వెళ్లాల్సి ఉంది. అయితే, ఉదయం 9 గంటలకు వెళ్లాల్సింది, గంట ఆలస్యంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి రావడంతో ఆగ్రహించిన కోమటిరెడ్డి, బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి వెళ్లిపోయారు. ఇతర మంత్రులు ఫోన్ చేసినా కోమటిరెడ్డి వారి కాల్‌కు ప్రతిస్పందించలేదు. ఇది ఇద్దరి మధ్య బహిరంగ వాగ్వాదానికి దారి తీసింది.ఈ క్రమంలోనే ఉత్తమ్ కుమార్ రెడ్డి, “ప్రభుత్వ వనరులను ఇష్టానుసారం వాడుకోకూడదు. కొందరు అతిగా ప్రవర్తిస్తున్నారు” అంటూ కోమటిరెడ్డిని ఉద్దేశించి పరోక్ష విమర్శలు చేశారు. దీనికి స్పందించిన కోమటిరెడ్డి, “ప్రభుత్వ వనరులను వాడుకునే హక్కు మాకు ఉంది. దీనిపై కొందరు అనవసరంగా రచ్చ చేస్తున్నారు” అని వ్యాఖ్యానించారు. ఇలా నల్గొండ జిల్లాలోనూ, క్యాబినెట్ లోనూ ఇద్దరు సీనియర్ మంత్రుల మధ్య ఆధిపత్య పోరుకు ఈ ఘటన నిదర్శనమైంది.రాజకీయ విమర్శల్లో భాగంగా కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో తీవ్ర దుమారం లేపాయి. సినీ నటుడు నాగార్జున, నటి సమంతపై కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వారు తీవ్రంగా ప్రతిస్పందించడం జరిగింది. సమంత విడాకులకు కారణం కేటీఆర్ అంటూ చేసిన తీవ్ర వ్యాఖ్యలపై సినీ పరిశ్రమ కూడా తీవ్ర స్థాయిలో తన ప్రతిస్పందన తెలియజేసింది. కొండా సురేఖ వ్యాఖ్యలను తప్పు బడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అంతే కాకుండా, కేటీఆర్ దీనిపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ లీగల్ నోటీసులు కూడా పంపడం జరిగింది. ఈ క్రమంలో, తన వ్యాఖ్యలను కొండా సురేఖ బహిరంగంగా ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఈ వివాదం తొందరపాటు వ్యాఖ్యల ఫలితంగా చెప్పవచ్చు.మంత్రుల మధ్య వివాదాస్పద వ్యాఖ్యలు ఇలా ఉంటే, ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరినా ఉప ఎన్నికలు వచ్చేది లేదని అన్నారు. అయితే, కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ చేస్తోన్న సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టింది.ఈ వ్యాఖ్యలు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం)ను అపహాస్యం చేస్తున్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి అలా ఎలా మాట్లాడతారని ప్రశ్నించింది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సీఎం వ్యాఖ్యలు చేయకూడదని హితవు పలికింది. సుప్రీంకోర్టు స్పందనతో సీఎం రేవంత్ రెడ్డి తిరిగి అసెంబ్లీలో తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేయడం జరిగింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా మాట్లాడకూడదన్న అంశం ఈ వివాదాస్పద వ్యాఖ్యల ద్వారా అర్థం అవుతోంది.విమర్శలు, సూచనలు, అభిప్రాయాలు ఏవైనా తొందరపాటుతనంతో చేస్తే అది పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగిస్తాయనడానికిపై ఉదంతాలు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఇది పాలనపైనా, పార్టీ ఎదుగుదలపైనా ప్రభావం చూపుతోంది. అంతే కాకుండా, కొందరు రాజకీయ నేతల రాజకీయ జీవితాలు సమాప్తమైన ఘటనలు సమకాలీన రాజకీయాల్లోనూ ఉన్నాయి. అందుకే, ఆచి తూచి మాట్లాడిన నేతలకే గౌరవం దక్కుతుంది.

# జీఎస్టీ తగ్గింపును ప్రజలందరూ వినియోగించుకోవాలి








**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించే జీఎస్టీ తగ్గింపును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. శుక్రవారం ఉదయం రాయచోటిలోని సాయి శుభ ఫంక్షన్ హాల్ లో జిల్లా వాణిజ్య పన్నుల శాఖ మరియు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ వస్తువులకు జీఎస్టీ తగ్గింపు పై సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం మరియు ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతో మేలు

**◆జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

చేకూరుతుందని, ప్రభుత్వాలకు ఆర్థికంగా నష్టమైనప్పటికీ ప్రజల సంక్షేమం దృష్ట్యా జీఎస్టి తగ్గింపు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫ్రిడ్జ్ మైక్రోవేవ్ ఓవెన్ టీవీలు వాషింగ్ మెషిన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సెల్ఫీ బూతు దగ్గర నిలబడి జిల్లా కలెక్టర్ సెల్ఫీ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గోరంట్లలో ఘనంగా బాలికా దినోత్సవం





**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా గోరంట్ల పట్టణం లోని ఎస్ ఏ పి ఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల నందు సీడీపీవో డాక్టర్ శాంత లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు, కళాశాల సీనియర్ అధ్యాపకులు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులు గా ఎంపిడిఓ కమలా బాయి, సీఐ బోయ శేఖర్, ఎం ఈ ఓ గోపాల్,ప్రధానోపాధ్యాయులు మాలతి, ఆర్డిటీ ఏ టి ఎల్ నరసింగరావు, ఏ ఎన్ కే డిగ్రీ కళాశాల అధ్యాపకులు జయప్రకాష్ ,పిడి నరసింహప్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీ ఓ శాంత లక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గోరంట్ల మండలం లోని అన్ని హై స్కూల్స్ లోనూ ఎం ఈ ఓ సహకారం తో పిల్లలకు కాంపిటీషన్స్ నిర్వహించి 50 మంది పిల్లలను ఎంపిక చేసామని వారిని ,వారి తల్లిదండ్రుల ను ఈ కార్యక్రమానికి ఆహ్వానించామని తెలియజేశారు. బాలికలకు ,వారి తల్లిదండ్రులకు అంతర్జాతీయ బాలికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అతిథులు మాట్లాడుతూ బాలికలు దేశానికి వెలుగులు అని బాలికల అభివృద్ధి దేశాభివృద్ధి అని అందుకే బాలికలను బాగా చదివించాలని , జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంపిడిఓ కమలా బాయి మాట్లాడుతూ పిల్లలు ఉదయమే లేచి కాసేపు వ్యాయామం, యోగా చేసి బాగా చదువు కోవాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని , పాజిటివ్ ఆలోచనలు చేయాలని సూచించారు, పిల్లలకు ప్రభుత్వం చాలా సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు, సీఐ బోయ శేఖర్ బాలికలకు ఈవిటీజింగ్ , సైబర్ నేరాలు ,బాలల హక్కులు,చట్టాలు గురించి వివరించారు. పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో బహుమతులు అందజేశారు, ఈ సందర్భంగా పిల్లలకు పౌష్టికాహారం పై అవగాహన కోసం స్థానికంగా తయారు చేసే వంటల తో ఎక్సిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు నాగరాణి ,శంకరమ్మ ,మంజుల, అంగన్వాడి టీచర్లు బిట్ర ప్రమీల,మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారు

## ఎలక్షన్ కమిషన్‌పై ఐదు కోట్ల మంది సంతకాల సేకరణ ప్రారంభమైంది - ఏఐసీసీ, ఏపీ పీసీసీ శ్రేణులు






**రాయచోటి, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో భాగంగా అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమీక్ష సమావేశం రాయచోటి పట్టణంలో అధ్యక్షుడు గాజుల భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసిసి కార్యదర్శి గణేష్ కుమార్ యాదవ్, ఏపీ సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లిలు హాజరయ్యారు. ఈసమావేశం పార్టీ బలోపేతం నిర్మాణాత్మక చర్యలు, గ్రామస్థాయిలో మరింత నిర్మాణాత్మక శక్తిగా కాంగ్రెస్ పార్టీని నిర్మించే దిశగా ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. కార్యకర్తల ఉత్సాహం ఐక్యత పార్టీ పునర్జీవనానికి సంకేతంగా నిలిచింది. ఈ సందర్భంగా మస్తాన్ వల్లి మాట్లాడుతూ మీ ఇంట్లో ఎలక్షన్ కమిషన్ అనే ఏజెంటు మీ ఓట్లను దొంగతనం చేసి నరేంద్ర మోడీని గెలిపించాడు, 200 మంది విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ అసెంబ్లీ సెగ్మెంట్లో 1200 ఓట్లు ఒకే ఇంట్లో ఉన్నాయని చెప్పారు. ఎలక్షన్ కమిషన్ తప్పు జరిగిందా రైట్ జరిగిందా అని చెప్పలేదు. మీలాంటి ఒక పాత్రికేయులు రాహుల్ గాంధీ చెప్పింది నిజమా కాదా అని ఎంక్వయిరీ చేస్తే నిజమని తేలింది. ఒక సింగిల్ బెడ్ రూమ్ వెస్ట్ బెంగాల్ నుంచి వచ్చే కూలి పని చేసుకునే వాళ్ళ ఇంట్లో 200 ఓట్లు అలాగే ఒకే వ్యక్తికి నాలుగు రాష్ట్రాల్లో ఓట్లు ఉన్నాయి. బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్లు చేయడం కోసం నాలుగు ఐదు లక్షల్లో ఎలక్షన్లు పెడతారు ఇదంతా ఒక పథకం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ పూర్తిగా దుర్మార్గం విధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాడు 33 కేసులు ఇవాళ రాహుల్ గాంధీ మీద పెట్టారు, ప్రతిపక్ష నాయకుడు సీటు కూడా పార్లమెంటులో తీసేటటువంటి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేకపోతే దేశ ప్రజాస్వామ్యం అంతమయి హిట్లర్ లాంటి పరిపాలనగా తయారవుతుందన్నారు, ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం గానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గానీ నరేంద్ర మోడీ గురించి వ్యతిరేకంగా ఒక మాట మాట్లాడరు. మోడీ ఏ కాండిడేట్ పెడితే ఆ కాండిడేట్ కి ఓట్లు వేస్తారు. ఏ రాష్ట్రంలో అయినా అధికార ప్రతిపక్ష పార్టీలో ఉంటాయి కానీ ఈ రాష్ట్రంలో మాత్రం గల్లీలలో నువ్వు దొంగ,నువ్వు దొంగ అంటారు. ఢిల్లీలో ఇద్దరు దొంగలు ఆ పెద్ద దొంగకి మద్దతు పలుకుతాయన్నారు. దీనికి వ్యతిరేకంగా స్వయం ప్రతిపత్తి కలిగిన ఎలక్షన్ కమిషన్ పై 5 కోట్ల మంది సంతకాలను సేకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్, జిల్లాలోని అన్ని నియోజకవర్గ కన్వీనర్లు, డిసిసి సెక్రెటరీ అమీర్ భాష, జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డి నగర్ సుల్తానా, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నకృష్ణ దర్బార్, రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, ఖాదర్ ఖాన్, మహమ్మద్ రఫీ, సేవాదళ్ అమీర్ భాష, గిరిబాబు, షబ్బీర్, భాస్కర్ రెడ్డయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబును కలిసిన విజయశ్రీ

**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** సర్వేపల్లి నియోజకవర్గంలో శుక్రవారం పలు పరిశ్రమలు విద్యాసంస్థల ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎన్డిఏ కూటమి గెలుపుకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఎం చంద్రబాబును కోరారు. వారి వెంట మాజీ ఎంపీ,సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఉన్నారు.

## బీటీబీ డ్యాంని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, అక్టోబర్ 10 :** గుమ్మగట్ట మండలంలోని బైరవనితిప్ప (బీటీబీ) డ్యాంని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమగ్రంగా పరిశీలన చేశారు. శుక్రవారం డ్యాంని పరిశీలన చేసి నీటి నిల్వ గురించి అడిగి తెలుసుకున్నారు. గేట్లను తనిఖీ చేసి, డ్యాం పరిస్థితిని, కాలువలు, ఆయకట్టు గురించి అధికారులతో జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, తహసీల్దార్ రజాక్ వలి, తదితరులు పాల్గొన్నారు.



## ఐసీడీఎస్ పీడీగా అరుణకుమారి బాధ్యతల స్వీకారం



**అనంతపురం టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఐసీడీఎస్ అనంతపురం జిల్లా ఇన్చార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్(పీడీ)గా కడప అరుణకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సరిగ్గా ఉదయం 10 గంటలకు ఆమె ఐసీడీఎస్ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ఆమెకు మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి, సీనియర్ అసిస్టెంట్లు దువ్వూరు బాబా నూరుద్దీన్, ధనలక్ష్మి, ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ ఖాజీ రఫీమున్నీసా, డీసీపీఓ మంజునాథ్, చైల్డ్ లైన్ కృష్ణమాచారి, ఇస్నిప్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ షాహిన, సిబ్బంది స్వాగతం పలికారు. పూల మొక్క అందించారు. శాలువ కప్పి సన్మానించారు. ఆ తరువాత ముఖ్యమైన ఫైలుపై కొత్త పీడీ అరుణకుమారితో సంతకం చేయించారు.

## ఇన్సూరెన్స్ పాలసీలపై పోలీస్ సిబ్బందికి అవగాహన




**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు సిబ్బందికి పోలీసు శ్యాలరీ ప్యాకేజీ- ప్రయోజనాలు మరియు సఫైర్ సూపర్ హెల్త్ టాప్ అప్ హెల్త్ ఇన్సురెన్స్ పాలసీలపై శుక్రవారం నాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో అనంతపురం సాయినగర్ బ్రాంచి ఏజిఎం నందగోపాల్, డిప్యూటీ బ్రాంచి మేనేజర్ నాగకుమార్ లు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలు నుండీ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని కానిస్టేబుళ్ల నుండీ పోలీసు అధికారులకు సదరు పాలసీలపై అవగాహన చేశారు. శ్యాలరీ ప్యాకేజీ స్కీం నుండీ ఎలాంటి బెన్ఫిట్స్ ఉన్నాయో వివరించారు. అదేవిధంగా సఫైర్ సూపర్ హెల్త్ టాప్ అప్ హెల్త్ ఇన్సురెన్స్ పాలసీ ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆర్ ఐ పవన్ కుమార్ , పలువురు ఆర్ ఎస్ ఐలు, ఏ ఆర్ ఎస్ ఐ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు



## ప్రజలకు మీరందించిన సేవలు ఎనలేనివి

◆ బదిలీపై వెళుతున్న జేసీని సన్మానించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవోగా బదిలీపై వెళ్తున్న శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ని శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు, సత్యసాయి కలెక్టరేట్ లో జేసీ అభిషేక్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు, సత్యసాయి జిల్లాకు జేసీగా పనిచేసిన అభిషేక్ కుమార్ అత్యుత్తమ స్థాయిలో ప్రజలకు సేవలు అందించారని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కొనియాడారు, భవిష్యత్‌లో సత్యసాయి జిల్లాకు అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు, మాజీ మంత్రి వెంట పుట్టపర్తి నియోజకవర్గం కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## సేవ్ మెడికల్ కాలేజ్



**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న 17 మెడికల్ కాలేజ్‌లను పిపిపి విధానన్ని రద్దు చేయాలని కోరుతూ కర్నూలులోని స్వగృహంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను పత్తికొండ నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ నాయకతో కలసి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మరియు వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర కమిటీ మెంబర్లు, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, మండల కన్వీనర్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు లు, సర్పంచులు,జిల్లా కార్యవర్గ సభ్యులు,పత్తికొండ తాలూకా అనుబంధ సంఘాల అధ్యక్షులు,మండల కార్యవర్గ సభ్యులు, ఎంపీటీసీలు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## కట్టా వెంకటరమణారెడ్డి దంపతుల పెళ్లిరోజు వేడుకలు



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, సురేఖరెడ్డి దంపతుల 46వ పెళ్లిరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. నాయుడు పేట పట్టణంలోని మాతృశ్రీ అపార్ట్మెం ట్‌లో గల టిడిపి నేత కట్టా వెంకట రమణా రెడ్డి నివాసంలో శుక్ర వారం వారి 46వ పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు,మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబసభ్యులు కట్టా వెంకట రమణారెడ్డి, సురేఖ రెడ్డి దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కట్టా వెంకటరమణారెడ్డి దంపతులు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో, నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

## ప్రధానికి కర్నూలులో పర్యటించే నైతిక హక్కు లేదు




**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** జీఎస్టీ విజయోత్సవాల పేరుతో ప్రచారం చేసుకోవడానికి అక్టోబర్ 16న కర్నూలు నగరంలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటిస్తు న్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున సభ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు ఇవ్వకుండ,కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయకుండ, విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ ఆపకుండా తీరని అన్యాయం చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి కర్నూలులో పర్యటించే నైతిక హక్కు లేదని గో బ్యాక్ ప్రధాని నరేంద్ర మోడీ అని 15 వ తేదీ నాడు కర్నూలు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నల్ల జెండాలతో నిరసన ర్యాలీలు నిర్వహించాలని అక్టోబర్ 9వ తేదీ న సి.ఆర్.భవన్ కర్నూలు నందు జరిగిన వామపక్ష పార్టీల సమావేశం కలిసి వచ్చిన విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని విద్యార్థి కార్యదర్శులు చొరవ చేసి అన్ని ప్రాంతాల్లో వామపక్ష పార్టీల నాయకులతో మాట్లాడి కార్యక్రమాన్ని రూపొందించుకొని ఎక్కువ మందిని సమీకరించి భారీ ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించాల్సిందిగా కోరుతున్నాము.

# నేరాల నియంత్రణకు కృషి చేయండి : జిల్లా ఎస్పీ సతీష్ కుమార్





**శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** పోలీస్ అధికారులు నేరాల నియంత్రణ కోసం కృషిచేసి ప్రజలకు సేవ చేయాలని ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు శుక్రవారం కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట ,నల్లచెరువు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసి పోలీసుస్టేషన్లు, రికార్డుల నిర్వహణ,పెండింగ్ కేసుల పై పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ , లాకప్ గది, రిసెప్షన్ కౌంటర్ పరిసరాలను సందర్శించి పోలీసుస్టేషన్ నిర్వహణ మరియు లాంగ్ పెండింగ్ , ఎండి పిఎస్, కేసులు, రికార్డుల నిర్వహణపై లోతుగా పరిశీలించారు. విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే ప్రతీ రికార్డును పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రత్యేక నిఘా వేయాలన్నారు. అక్రమ మద్యం, ఇసుక... మట్కా, గుట్కా పేకాట, క్రికెట్ బెట్టింగ్ , తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పనిచేయాలని సూచించారు. మహిళా పోలీసులు గ్రామాలకు వెళ్లి అక్కడ సమస్యలను తెలుసుకొని పై అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహాలు, సైబర్ మోసాలు, పోక్సో కేసులు , నూతన చట్టాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నేరస్తులు, రౌడీ షీటర్లు కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అవినీతికి తావులేకుండా అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలన్నారు. సిబ్బంది విధులు వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ వార్షిక తనిఖీలో జిల్లా ఎస్పీతో పాటు కదిరి డిఎస్పి శివన్నారాయణ స్వామి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్సై మక్బూల్ ఏఎస్ఐ వెంకటరాముడు , సిబ్బంది ఉన్నారు.

# ఎన్డీఏ కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు

◆ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ





**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఎన్డీఏ కూటమి పాలనలో సంక్షేమం,అభివృద్ధి పరుగులు తీస్తున్నాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలో రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు,డ్రైనేజీ కాలవల పనులకు ఎమ్మెల్యే స్థానిక కూటమి పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.గత పది ఏళ్లుగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిం దని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి పాలనలో ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి రాష్ట్ర ప్రగతిని పెంచేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలియ జేశారు. నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో అవసరమైన ప్రతి చోటా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలవలు నిర్మించనున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక,నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్.రఫీ, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్,సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్,నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,హరినాథ్ రెడ్డి,మొండెం బాబు,వినుకొండ ధనంజయ, చెందేటి సుజాత, తుపాకుల కన్నెమ్మ,గుంటూరు లక్ష్మయ్య, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా,పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** గోరంట్ల పట్టణంలోని ఎండల బండ వీధిలో కాపురం ఉంటున్న ఒక యువతి అదృశ్యం అయినట్లు యువతి తల్లి సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు, యువతి బూదిలి వద్ద గల పరిశ్రమలో పనిచేస్తోందని,8వ తేదీ వెళ్లి ఇంటికి రాకపోవడం తోపాటు ఆచూకీ లేక పోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి చేయూత

◆ మంత్రి ఆదేశాలతో రూ.52 వేల ఆర్థిక సహాయం

◆కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో నివాళులు



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** గోరంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ టిడిపి కార్యకర్త షేక్ పీరా సాబ్ భార్య జరీన్ తజ్ ఆకస్మికంగా మృతి చెందింది, మంత్రి సవితమ్మ ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో మండల నాయకులు తమ వంతు బాధ్యతగా సీనియర్ టిడిపి కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలని ఆలోచనతో పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఆర్థిక సహాయానికి ముందుకు వచ్చారు, ఈ నేపథ్యంలో పట్టణంలోని రాజీవ్ కాలనీలోని పీరా నివాసం వద్దకు చేరుకొని మృతురాలు జరీన్ తజ్ కు నివాళులు అర్పించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ పార్టీ నిరంతరం మీకు అండగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు.అనంతరం మంత్రి ఆదేశాలతో స్థానిక నాయకుల ద్వారా సేకరించిన రూ, 52 వేల నగదును టిడిపి కార్యకర్త పీరాకు అందజేసి అభయాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, మాజీ సర్పంచ్ నరేష్, మండల టీడీపీ నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్, ఉత్తమ రెడ్డి, సర్పంచ్ సరోజ నాగే నాయక్, మాజీ కో ఆప్షన్ మెంబర్ షేక్ అజ్మతుల్లా,డైరెక్టర్ నబీ రసూల్, దేవాంగం శ్రీనివాసులు, మల్లాపల్లి మహమ్మద్, పట్టణ కన్వీనర్ కక్కల రఘునాథ్ నాథ్ రెడ్డి,వెంకట్ రెడ్డి, చింతా రామచంద్రారెడ్డి, మామిడికాయల హరి ప్రసాద్ , గంగం పల్లి శుభహాన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



## ఓబన్న విగ్రహావిష్కరణకు వడ్డే వెంకట్‌కు ఆహ్వానం



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు రావాల్సిందిగా తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్ ని గోరంట్ల మండల వడ్డెర సంఘం నాయకులు ఆహ్వానించారు,శుక్రవారం సాయంత్రం అనంతపురం నగరంలోని వడ్డే వెంకట్ నివాసంలో గోరంట్ల మండల వడ్డెర సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు, గోరంట్ల మండలం వడ్డెర సంఘం అధ్యక్షులు వడ్డే రామాంజనేయులు గౌనివారిపల్లి సింగల్ విండో అధ్యక్షులు రవి మోహన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వడ్డే అమర్ నాథ్ ,అమడగూరు మండలం వడ్డెర సంఘం అధ్యక్షులు వడ్డే రమణప్ప, వడ్డెర సంఘం నాయకులు వడ్డే శ్రీనివాసులు, వడ్డే హనుమన్న తదితరులు కలిసి గోరంట్ల పట్టణంలో ఈనెల 26న వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు రావలసినదిగా కరపత్రం అందించి ఆహ్వానించారు, ఈ సందర్భంగా వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు.

## వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణకు రండి

### ఎంపీ బీకేకు ఆహ్వానం

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** పెనుగొండ నియోజకవర్గం లోని గోరంట్ల పట్టణం లోని బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేస్తున్న వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 26న ఆదివారం నిర్వహిస్తున్న సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె పార్థసారధినీ వడ్డెర్ల సంఘం నాయకులు ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో గౌనివారిపల్లివారి పల్లి సింగిల్ విండో చైర్మన్ రవి మోహన్, డైరెక్టర్ అమర్‌నాథ్, వడ్డెర సంఘం నాయకులు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే సినిమా



ప్రియదర్శి, నిహారిక ఎన్ ఎం జంటగా నటించిన చిత్రం 'మిత్రమండలి'. విజయేందర్ దర్శకత్వంలో బీవీ వర్క్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ సమర్పణలో సప్తాస్వ మీడియా వర్క్స్ పై కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రమిది. ఈ మూవీ ఈనెల 16న రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో నిర్మాతలు కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప మీడియాతో ముచ్చటించారు.

**'మిత్ర మండలి' జర్నీ ఎలా ప్రారంభమైంది?**

బన్నీ వాస్ మాకు మంచి స్నేహితులు. గీతా ఆర్ట్స్‌లో మేం చాలా కాలం ఆయనతో పాటుగా పని చేశాం. 'కోటబొమ్మాళీ పీఎస్', 'ఆయ్', 'తండేల్', 'సింగిల్' ఇలా చాలా చిత్రాల్ని చేశాం. ఈ కథ వినమని వాసు చెప్పారు. స్టోరీ చాలా నచ్చింది. ఆద్యంతం వినోదాన్ని అందిస్తూనే సెటైరికల్‌గా ఉంటుంది.

**దర్శకుడు విజయేందర్ గురించి?**

విజయేందర్ మంచి దర్శకుడు. అనుదీప్, 'మ్యాడ్' కళ్యాణ్, ఆదిత్య హాసన్‌లతో విజయేందర్ పని చేశాడు. పూర్తి స్క్రిప్ట్‌తోనే మా వద్దకు వచ్చాడు. కథను ఎంత అద్భుతంగా రాసుకున్నాడో.. అంతే అద్భుతంగా తీశాడు. కొత్త దర్శకుడిలా, మొదటి సినిమాలా అనిపించలేదు.

**ప్రియదర్శి, నిహారిక, బ్రహ్మానందం పాత్రలు ఎలా ఉండబోతోన్నాయి?**

'జంగ్లీ పట్టణం' అనే ఓ ఫిక్షనల్ టౌన్‌ను డైరెక్టర్ క్రియేట్ చేశాడు. ఆ ఫిక్షనల్ టౌన్‌లో జరిగే కథ, అందులోని పాత్రలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఈ చిత్రం ఎక్కువగా యూత్‌కు రిలేట్ అవుతుంది. వారికి ఇంకా ఎక్కువగా నచ్చుతుంది. నిహారిక మాట్లాడితే ఓ సెటైర్ కనిపిస్తుంది. ఇందులో అలాంటి పాత్రే ఉంటుంది. అందుకే ఆమెను తీసుకున్నాం. ఇక ప్రియదర్శి గురించి వేరే చెప్పక్కర్లేదు. అలాగే బ్రహ్మానందం పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది. 'జంబర్ గింబర్ లాలా' పాటను అనుకోకుండా బ్రహ్మానందంతో చిత్రీకరించాం. ఆయన కూడా ఆ పాటను, లిరిక్స్‌ను బాగా ఎంజాయ్ చేశారు.

**'జాతి రత్నాలు'తో ఈ సినిమాని పోల్చుతున్నారు కదా?**

'మిత్ర మండలి' అనేది కూడా బడ్డీస్ కామెడీ. అందుకే అందరూ 'జాతి రత్నాలు' సినిమాతో పోల్చుతున్నారు. అయితే ఆ కథకు, మా కథకు ఎలాంటి సంబంధం లేదు. ఆ మూవీలాగే మా చిత్రాన్ని చూసి కూడా అంతే ఎంజాయ్ చేస్తారు.

**కుల వ్యవస్థ మీద సెటైర్స్ వేశారట. నిజమేనా?**

అవును. 'మిత్ర మండలి' కోసం లేని ఓ కులం పేరుని తీసుకువచ్చాం. అలా చేసిన ఫిక్షనల్ క్యాస్ట్‌తో సమాజంలో ఉన్న క్యాస్ట్ సిస్టం మీద సెటైరికల్‌గా సీన్లను చిత్రీకరించాం.


**మీ ఫ్యూచర్ ప్రాజెక్ట్‌లు ఎలా ఉండాలనుకుంటున్నారు?**

మేం అన్ని రకాల జోనర్లలో చిత్రాల్ని చేయాలని ప్రయత్నిస్తున్నాం. ఇప్పుడు కామెడీ ఎంటర్టైనర్‌తో వస్తున్నాం. త్వరలోనే హర్రర్ మూవీని ప్రారంభించనున్నాం. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా మంచి కథలతో సినిమాల్ని తీస్తాం.

# స్పెయిన్‌లో కీలక షెడ్యూల్

హీరో రవితేజ, దర్శకుడు కిషోర్ తిరుమల కాంబోలో ఓ సినిమా రూపొందుతోంది. ఇది రవితేజ హీరోగా నటిస్తున్న 76వ సినిమా. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.


టీమ్ ప్రస్తుతం కీలక ఫారిన్ షెడ్యూల్‌కి షిఫ్ట్ అయ్యింది. గత కొన్ని రోజులుగా స్పెయిన్‌లోని వాలెన్సియా, సమీప దీవుల్లోని లొకేషన్ రెక్కీ పనులు పూర్తి చేసింది. శనివారం నుంచి చిత్రీకరణ ప్రారంభమవు తోంది. అనంతరం జెనీవా, ఫ్రాన్స్‌లో కూడా కీలకమైన సన్నివేశాల షెడ్యూల్ జరుగనుంది. మొత్తం 25 రోజుల ఈ షెడ్యూల్‌లో కీలక టాకీ పార్ట్‌తో పాటు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీతో రెండు పాటలు చిత్రీకరించబోతున్నారు.



'ఎలక్ట్రిక్ ఎనర్జీతో ప్రేక్షకులను అలరించే రవితేజ ఈ సినిమాలో న్యూ స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు. ఇది హ్యూమర్, ఎమోషన్, రవితేజ మార్క్ మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్-ఫ్లెడ్జ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతోంది. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు' అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి డీఓపీ: ప్రసాద్ మూరెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి.

## అలాంటిది.. మన ఫ్యామిలీలో జరిగితే?



'లవ్ టుడే, డ్రాగన్'లతో రెండు వరుస హిట్‌లను అందించిన హీరో ప్రదీప్ రంగనాథన్ 'డ్యూడ్'తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు' వంటి అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈనెల 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శరత్ కుమార్ మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు. కథలో ముఖ్య భాగమయ్యే పాత్రలు చేయడానికి ఇష్టపడతాను. డైరెక్టర్ కీర్తిశ్వరన్ ఈ కథ చెప్పినప్పుడు, ఇందులో కచ్చితంగా నటించాలని అనిపించడానికి కారణం కూడా ఇదే. కథ అద్భుతంగా ఉంది. ప్రదీప్‌కి అంకుల్‌గా కనిపిస్తాను. కథలో నా పాత్ర చాలా క్రూషియల్. చాలా కొత్త పాయింట్. ఒక ఫ్యామిలీలో ఇలాంటి ఒక మేటర్ జరిగితే సొసైటీ ఎలా రియాక్ట్ అవుతుందనే కోణంలో డైరెక్టర్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఇది రెగ్యులర్ సినిమాలా ఉండదు. ఇది చాలా ఎమోషనల్ ఫిల్మ్. కథలో మంచి కాన్ఫ్లిక్ట్ ఉంది. కామెడీ హ్యూమర్, ఎమోషన్ అన్నీ డిఫరెంట్‌గా ఉంటాయి. పెర్ఫార్మెన్స్ చేయడం కూడా టఫ్. నా పాత్రలో చాలా డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. అలాగే నా క్యారెక్టర్‌కి ఉన్న రూల్స్, కండీషన్స్ భిన్నంగా ఉంటాయి. ఇందులో ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు మంచి కంటెంట్ ఉంది. చాలా కొత్త థాట్ ఉంది. ఆడియన్స్ చాలా కొత్తగా ఫీల్ అవుతారు. ప్రదీప్ ఆల్ రౌండర్. మంచి డైరెక్టర్, గుడ్ పెర్ఫార్మర్. ఈ సినిమాలో తన పెర్ఫార్మెన్స్ హై ఎనర్జీతో ఉంటుంది. సాయి అభ్యంకర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాకి తన మ్యూజిక్ బిగ్ ఎసెట్. మైత్రీ మూవీ మేకర్స్ చాలా పెద్ద ప్రొడ్యూసర్స్. సినిమాని చాలా ప్యాషన్‌తో తీస్తారు. సినిమాని ప్రేమిస్తారు. సినిమాకి కావాల్సిన ప్రతీదీ ఎక్కడా రాజీపడకుండా సమకూర్చారు. డైరెక్టర్‌కి కంప్లీట్ ఫ్రీడమ్ ఇచ్చారు. సుభాస్ చంద్రబోస్ బయోపిక్ చేయాలని ఉంది. 'మిస్టర్ ఎక్స్' అనే సినిమా చేస్తున్నాను. బాలీవుడ్‌లో ఒకటి, అలాగే గౌతమ్ మీనన్ కాంబినేషన్‌లో మరో సినిమా ఉంది. నవంబర్‌లో ఓ సినిమా రిలీజ్‌కి రెడీగా ఉంది.



# జైస్వాల్ శతక జోరు

- అజేయ 173తో చెలరేగిన యువ ఓపెనర్ - అర్ధ సెంచరీతో రాణించిన సాయి సుదర్శన్ - వెస్టిండీస్‌తో రెండో టెస్టు తొలి రోజు -భారత్ తొలి ఇన్నింగ్స్ 318/2

**యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (173 నాటౌట్) శతకంతో దండెత్తాడు. ఢిల్లీ ఫిరోజ్ షా కోట్ల గ్రౌండ్‌లో కరీబియన్ బౌలర్లతో ఆడుకున్న యశస్వి జైస్వాల్ తొలి రోజే 173 పరుగులతో చెలరేగాడు. సాయి సుదర్శన్ (87) సైతం అర్ధ సెంచరీతో రాణించడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో తొలి రోజు 318 పరుగులు చేసింది. జైస్వాల్, గిల్ క్రీజులో ఉండగా.. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరుపై కన్నేసింది.**



**న్యూఢిల్లీ:** యశస్వి జైస్వాల్ (173 నాటౌట్, 253 బంతుల్లో 22 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగగా.. బి. సాయి సుదర్శన్ (87, 165 బంతుల్లో 12 ఫోర్లు) అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. జైస్వాల్, సాయి సుదర్శన్ మెరుపులతో వెస్టిండీస్‌తో రెండో టెస్టు తొలి రోజు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 318/2 పరుగుల భారీ స్కోరు చేసింది. కరీబియన్ బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేసినా.. యశస్వి జైస్వాల్ వన్‌మ్యాన్ షోతో భారత్ తొలి రోజు ఆటలో పైచేయి సాధించింది. వెస్టిండీస్ స్పిన్నర్ జొమెల్ వారికన్ (2/60) రెండు వికెట్లు పడగొట్టి రాణించాడు. తొలి రోజు ఆట ముగిసేసరికి యశస్వి జైస్వాల్‌తో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (20 నాటౌట్, 68 బంతుల్లో 3 ఫోర్లు) అజేయంగా క్రీజులో నిలిచాడు.

### ఓపెనర్ల శుభారంభం

తొలి రెండు రోజులు బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై టాస్ నెగ్గిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. శీతల వాతావరణంలో బంతి అందుకున్న వెస్టిండీస్ బౌలర్లు క్రమశిక్షణ చూపించారు. లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులేశారు. కానీ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్ (38, 54 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. ఆరంభంలో యశస్వి జైస్వాల్ నెమ్మదిగా ఆడినా.. కెఎల్ రాహుల్ దూకుడు చూపించాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్ బాదిన రాహుల్%%% స్పిన్నర్ వారికన్‌పై ఎదురుదాడికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో స్టంపౌట్‌గా నిష్క్రమించాడు. ఓపెనర్లు తొలి వికెట్‌కు 17.3 ఓవర్లలో 58 పరుగులు జోడించారు.

### జైస్వాల్, సాయిసుదర్శన్ మెరుపుల్

పరుగుల వేటను నెమ్మదిగా మొదలెట్టినా కరీబియన్ బౌలర్లపై యశస్వి జైస్వాల్ తనదైన జోరు చూపించాడు. స్పిన్, పేస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. రాహుల్‌తో కలిసి 58 పరుగులు, సాయి సుదర్శన్‌తో కలిసి 193 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పాడు. పది ఫోర్లతో 82 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్.. లంచ్ సమయానికి మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించాడు. క్రీజులో కుదురుకున్న సాయి సుదర్శన్ సైతం చెప్పుకోదగిన ఇన్నింగ్స్ నమోదు చేశాడు. 9 ఫోర్లతో 87 బంతుల్లో అర్ధ సెంచరీ బాదిన సాయి సుదర్శన్.. కెరీర్ తొలి శతకం దిశగా సాగాడు. లంచ్ సెషన్‌లో భారత్ వికెట్ కోల్పోలేదు. కానీ టీ సెషన్ ఆరంభంలోనే మూడంకెల స్కోరుకు 13 పరుగుల దూరంలో వారికన్ మాయకు వికెట్ కోల్పోయాడు. దీంతో 193 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

### గిల్‌తో కలిసి దూకుడు

16 ఫోర్లతో 145 బంతుల్లో సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్.. శతకం తర్వాత పరుగుల వేటలో వేగం పెంచాడు. సాయి సుదర్శన్ అవుటైనా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి మరో 67 పరుగులు అజేయంగా జోడించాడు. గిల్ మూడు ఫోర్లతో ఫామ్ చాటుకున్నాడు. 19 ఫోర్లతో 224 బంతుల్లో 150 పరుగుల మార్క్ చేరుకున్న యశస్వి జైస్వాల్.. కెరీర్ మూడో డబుల్ సెంచరీ దిశగా వేగంగా దూసుకెళ్తున్నాడు. తొలి రోజు ఆటలో 90 ఓవర్లలో 2 వికెట్లకు భారత్ 318 పరుగులు చేసింది. మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ఫామ్‌లో ఉండటంతో నేడు భారత్ దూకుడుగా ఆడేందుకు అవకాశం ఉంది.

### స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 173, కెఎల్ రాహుల్ (స్టంప్డ్) టెవిన్ (బి) వారికన్ 38, బి సాయి సుదర్శన్ (ఎల్బీ) వారికన్ 87, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 20, మొత్తం : (90 ఓవర్లలో 2 వికెట్లకు) 318.

వికెట్ల పతనం : 1-58, 2-251.

బౌలింగ్ : జైడెన్ సీయల్స్ 16-1-59-0, అండర్సన్ ఫిలిప్ 19-2-44-0, జస్టిన్ గ్రీవ్స్ 8-1-26-0, జోమెల్ వారికన్ 20-3-60-2, రోస్టన్ ఛేజ్ 13-0-55-0.

# ఈ నెల 31న పీకెఎల్ ఫైనల్

- నేటి నుంచి ఢిల్లీ అంచె పోటీలు



**న్యూఢిల్లీ:** ప్రొ కబడ్డీ లీగ్ (పీకెఎల్) సీజన్ 12 ప్లే ఆఫ్స్ షెడ్యూల్ వచ్చేసింది. నేటి నుంచి ఢిల్లీ అంచె పోటీలు ఆరంభం కానుండగా.. ఈ నెల 23న లీగ్ దశ మ్యాచులకు తెరపడింది. 25న ప్లే ఇన్స్ మ్యాచుల్లో పాయింట్ల పట్టికలో 5 నుంచి 8వ స్థానంలో నిలిచిన జట్లు రేసులో సజీవంగా నిలిచేందుకు పోటీపడుతున్నాయి. ఈ ఏడాది సరికొత్త ఫార్మాట్లో సాగుతున్న లీగ్‌లో టైటిల్ రేసులో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. 26 నుంచి 29 వరకు ప్లే ఆఫ్స్‌లో ఎలిమినేటర్స్, క్వాలిఫయర్స్ ఉంటాయి. 31న టైటిల్ పోరు షెడ్యూల్ చేశారు. ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియం పీకెఎల్ ప్లే ఆఫ్స్‌కు వేదిక కానుంది. దబంగ్ ఢిల్లీ కెసి ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించగా.. మిగిలిన ఏడు స్థానాల కోసం గట్టి పోటీ నెలకొంది. ఈ సారి తెలుగు టైటాన్స్ సైతం ప్లే ఆఫ్స్ రేసులో ముందంజలో కొనసాగుతుంది.

# నేటి నుంచి పికిల్‌బాల్ టోర్నమెంట్



**హైదరాబాద్:** హైదరాబాద్ పికిల్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేటి నుంచి పికిల్ బాల్ ఓపెన్ టోర్నమెంట్ ఆరంభం కానుంది. హైదరాబాద్‌లోని ప్యాడిల్‌వేవ్ వేదికగా రెండు రోజుల పాటు రౌండ్ రాబిన్, నాకౌట్ ఫార్మాట్‌లో ఈ టోర్నమెంట్ జరుగుతుంది. ఓపెన్ విభాగంలో మహిళలు, పురుషుల సింగిల్స్, డబుల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ప్యాడ్లర్లు పోటీపడనున్నారు. సుమారు 200 మంది క్రీడాకారులు పోటీపడుతున్న ఈ టోర్నమెంట్‌లో విజేతలకు రూ.1.5 లక్షలు నగదు బహుమతి అందిస్తున్నామని హైదరాబాద్ పికల్‌బాల్ సంఘం అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు తెలిపారు.

Truth of News RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# బీజేపీలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ!

**తిరుపతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన కుటుంబం గుడ్ బై చెబుతుందా? కమలం గూటికి చేరుతుందా? బిజెపిలో చేరాల్సిన అనివార్య పరిస్థితి ఎదురయిందా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇప్పుడు దీని పైనే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన కుటుంబం ఇప్పుడు కేసుల్లో చిక్కుకుంది. వాటి నుంచి బయటపడాలంటే అధికార పార్టీలోకి వెళ్లడం ఒక్కటే మార్గం. ఆపై సొంత పార్టీ అధినేత నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించకపోవడంతో.. ఆ కుటుంబం బిజెపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఇంతకీ ఆ ఫ్యామిలీ ఏదంటే పెద్దిరెడ్డి. ఇటీవల పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైలు నుంచి బయటకు వచ్చారు. అయితే అదే మిధున్ రెడ్డిని ఇప్పుడు కేంద్రం ఐక్యరాజ్యసమితి సమావేశాలకు పంపిస్తుండడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. కూటమి( అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దూకుడుగా వ్యవహరించిన నేతలకు కేసుల ఇబ్బందులు తప్పడం లేదు. చివరకు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలను చేసిన వారిని సైతం విడిచిపెట్టలేదు. ఈ పరిస్థితుల్లో రాయలసీమను తన ఆధీనంలో ఉంచుకొని పాలించిన పెద్దిరెడ్డి



రామచంద్రారెడ్డి పై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆయనపై రకరకాల కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు మద్యం కుంభకోణం కేసులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు.. మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. రెండు నెలల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఇటీవల ఆయనకు బెయిల్ లభించింది. అయితే పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి కనీసం పరామర్శించలేదు. బెయిల్ పై బయటకు వచ్చిన మిధున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ఇష్టపడలేదు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో వైసిపి ఓటమిపై పోస్టుమార్టం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కానీ.. పెద్దిరెడ్డి కుటుంబం ఎలా గెలిచింది అన్నదానిపై జగన్మోహన్ రెడ్డి విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ సమయంలోనే టిడిపి తో పెద్దిరెడ్డి కుమ్మక్కయ్యారా? అన్న అనుమానాలు కూడా బయటపడ్డాయి. అటు తరువాత ఆ వివాదం ముగిసింది. అయితే అసెంబ్లీకి వైసిపి ఎమ్మెల్యేల హాజరు విషయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లీడ్ తీసుకోవాలని జగన్ సూచించారు. అందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒప్పుకోలేదు. అప్పటినుంచి జగన్లో అనుమానాలు మరింత పెరిగాయి అన్న ప్రచారం సాగుతోంది. ఐక్యరాజ్యసమితి సమావేశాలకు బిజెపి ఎంపీ పురందేశ్వరి నేతృత్వంలో అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులను ఎంపిక చేశారు. అయితే ఏపీ నుంచి ఆ బృందంలో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి కూడా ఉన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం నుంచి అభ్యంతరాలు వచ్చినా బిజెపి పెద్దలు మాత్రం మిధున్ రెడ్డిని ఎంపిక చేశారు. దీంతో పెద్దిరెడ్డి కుటుంబం బిజెపికి దగ్గర అయిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో పెద్దిరెడ్డి వైసీపీకి గుడ్ బై చెప్పరని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తుంటే మాత్రం పెద్దిరెడ్డి కుటుంబం కమలం గూటికి వెళ్లడం ఖాయం అని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# పవన్ నోట నిరాశజనకంగా మాటలు

**కాకినాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** కొద్దీ రోజుల క్రితం ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం లోని ఉప్పాడ ప్రాంతంలో మత్స్యకారులు సముద్రపు నీరు ఫ్యాక్టరీల కారణంగా కలుషితం అవుతున్నాయని, చేపలు విషపూరితంగా మారిపోతున్నాయని, దీనిపై స్పష్టమైన విచారణ చేపట్టి, చర్యలు తీసుకోకపోతే మేము అసలు చేపలు పట్టడానికే వెళ్ళమని, పవన్ కళ్యాణ్ వచ్చి మాట్లాడాలి అంటూ పెద్ద ఎత్తున నిరసన తెలిపిన వీడియోలను మనమంతా చూసాము. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ వెంటనే సమీక్ష నిర్వహించి, నేడు కాకినాడ జిల్లాలో పర్యటించి, ఉప్పాడ లో బహిరంగ సభని ఏర్పాటు చేసి అక్కడి మత్స్యకారులతో మాట్లాడాడు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన వాగ్దానాలు ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. పవన్ కళ్యాణ్ మాట ఇచ్చాడంటే, చేసి తీరుతాడు అంతే అంటూ ఈ వీడియోలను చూసిన ప్రతీ ఒక్కరు కామెంట్స్ చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'ఈరోజు ఉదయం కాకినాడ కలెక్టర్ గారితో ఈ సమస్య గురించి మాట్లాడాను. దాదాపుగా వంద మంది యువకుల నుండి ఏమి జరుగుతుందో తెలుసుకున్నాను. ఇది ఒక్క రోజులో తీరిపోయే సమస్య కాదు, కాబట్టి నాకు ఒక మూడు నెలలు సమయం ఇవ్వండి. దీని పరిష్కార మార్గం వెతుకుతాను, ఒక చక్కటి రూట్ మ్యాప్ తో మీ ముందుకొస్తాను, ఈ విషయం పై క్యాబినెట్ లో చర్చించడమే కాదు, అవసరమైతే అసెంబ్లీ లో కూడా చర్చిస్తాను. కాస్త సమయం ఇవ్వండి' అంటూ చెప్పుకొచ్చాడు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'ఉప్పాడ సముద్ర తీరం చుట్టూ రేటెన్షన్ వాల్ కట్టించడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాకపోతే ఈ వాల్ కోసం 350 కోట్ల రూపాయిలు కేంద్రం నుండి విడుదల అవ్వాలి. ఇప్పటికే రెండు సార్లు దీనిపై చర్చించారు, రేపు మూడవసారి చర్చించబోతున్నారు'. 'కేంద్రం ఆమోదం అయితే తెలిపింది కానీ, 250 కోట్లు ఇవ్వాలా?, లేకపోతే 350 కోట్లు ఇవ్వాల్సిందేనా అనే విషయం పై మాత్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నేను మన సాధక బాధకాలు మొత్తం చెప్పి, 350 కోట్ల రూపాయిలు ఇవ్వాలని రిక్వెస్ట్ చేసాను. అతి త్వరలోనే నిధులు విడుదల కాబోతున్నాయి. నేను మిగిలిన రాజకీయ నాయకులూ లాగా రెండు మూడు రోజుల్లో అయిపోతుందని మిమ్మల్ని మభ్యపెట్టే వ్యక్తిని



కాదు. ప్రతీ దానికి ఒక నిర్దిష్టమైన సమయం ఉంటుంది. సమయానుసారం అన్ని పనులు చకచకా జరిగిపోతాయి. అవసరమైతే రాజకీయాల నుండి తప్పుకుంటాను కానీ, మిమ్మల్ని నిర్లక్ష్యం చేసే ప్రసక్తే లేదు' అంటూ పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చాడు. పవన్ వచ్చి మాట ఇవ్వడం తో ఇన్ని రోజులు నిరసన తెలిపిన మత్స్యకారులు ఇప్పుడు శాంతించారు. చూడాలి మరి రాబోయే రోజుల్లో ఈ పనులు ఎంత వరకు ప్రోగ్రెస్ అవుతాయి అనేది.

# అయినా కమలం ఎందుకో వెనుకబడింది

**హైదరాబాద్, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ వెలువడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఈ ఉపఎన్నికపై ఎక్కువగా ఫోకస్ పెట్టాయి. కానీ భారతీయ జనతా పార్టీమాత్రం ఇప్పటికీ అభ్యర్థి ఎంపిక, ప్రచార వ్యూహం విషయంలో వెనుకబడింది. ఇది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈ కీలక నియోజకవర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని చెబుతున్నప్పటికీ, పార్టీలో నెలకొన్న అంతర్గత సందిగ్ధత, ఆలస్యం పలు ప్రశ్నలకు తావిస్తున్నాయి. బీజేపీ ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించకపోవడానికి ప్రధాన కారణం, రాష్ట్ర నాయకత్వం మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాలేనని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య అభ్యర్థి ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని వార్తలు వస్తున్నాయి. ఈ అంతర్గత విభేదాల కారణంగానే జాప్యం జరిగిందని, అందుకే సమస్య పరిష్కారం కోసం హైకమాండ్ ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసిందని సమాచారం. ఇది పార్టీలోని సమన్వయ లోపాన్ని బహిర్గతం చేస్తోంది. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటి జయసుధను బీజేపీ బరిలోకి దించే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. జయసుధ గతంలో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించారు. జూబ్లీహిల్స్‌లో ఉన్న గ్లామర్, ఎలైట్ వర్గాల ఓటర్లను, అలాగే సినీ అభిమానులను ఆకట్టుకోవడానికి బీజేపీ ఆమె అభ్యర్థిత్వాన్ని ఒక స్ట్రాటజీగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారైతే, అది నిస్సందేహంగా ఎన్నికలకు కొత్త ఫ్లేవర్ తీసుకొస్తుంది. అయితే జయసుధ క్రిస్టియన్ కావడం, ఇటీవలే పార్టీలో చేరడం లాంటివి ఆమెకు మైనస్ కావచ్చు. ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ లేకపోవడం, హిందూత్వ నినాదాన్ని తీసుకెళ్లే అవకాశం ఉండకపోవడం లాంటివి జయసుధ అభ్యర్థిత్వాన్ని వెనక్కు నెట్టవచ్చు. బీజేపీ ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిలో కనిపిస్తోంది. అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడం ద్వారా, చివరి నిమిషంలో ప్రచార పదును పెంచి, ప్రత్యర్థులు వ్యూహాలు మార్చుకోవడానికి సమయం లేకుండా చేయాలని భావిస్తూ ఉండొచ్చు. అయితే, అభ్యర్థి ఎంపిక విషయంలో అంతర్గత సమస్యే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రధాన ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు, వారి సామాజిక సమీకరణాలను బేరీజు వేసిన తర్వాత, అత్యంత బలమైన లేదా అత్యంత ప్రభావవంతమైన అభ్యర్థిని ఎంపిక చేయాలని బీజేపీ చూస్తుంది. జూబ్లీహిల్స్ పరిధిలోని ఓటరు వైవిధ్యాన్ని పరిగణలోకి తీసుకుని, జయసుధ లాంటి బలమైన గ్లామర్ అస్త్రాన్ని ఉపయోగించాలనుకోవచ్చు. అయితే అభ్యర్థి ఖరారులో జరుగుతున్న ఈ జాప్యం, బీజేపీకి ప్రతికూల అంశంగా మారే అవకాశం ఉంది. ప్రచారం కోసం సమయం తక్కువగా ఉంటుంది. అయితే, జయసుధ లాంటి సెలబ్రిటీని బరిలోకి దింపితే, ఆలస్యాన్ని అధిగమించి, ప్రజల్లో త్వరగా పట్టు సాధించే అవకాశం ఉంటుంది. మొత్తం మీద, ఉపఎన్నికలో సత్తా చాటాలంటే, బీజేపీ వెంటనే అంతర్గత సమస్యలను పరిష్కరించుకుని, వ్యూహాత్మకంగా అభ్యర్థిని ప్రకటించి, ప్రచారాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

## చెట్టుకు ఢీకొట్టిన కారు

◆ఏడుగురికి తీవ్ర గాయాలు

**జగిత్యాల, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** కోరుట్ల, మెట్పల్లి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపు తప్పిన కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అందులో ముగ్గురు పరిస్థితి విషమంగా వుంది. గురువారం రాత్రి కోరుట్ల పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు, కోరుట్ల నుండి మారుతీ నగర్ దాబా దగ్గర చాయ్ తాగడానికి వెళ్లడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది.. క్షతగాత్రులను జగిత్యాల్, కరీంనగర్ ఆసుపత్రి లకు తరలించారు.

## పాల సముద్రంలో చోరీ

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** పాల సముద్రం వద్ద గల మిషన్ తండా వద్ద కాపురం ఉంటున్న సుభాషిణి అను మహిళ ఇంటిలో అర్ధ కేజీ వెండి ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు,పిల్లలు అనంతపురం లో ఉండగా చూడటానికి వెళ్లగా ఇంటి వెనుక తలుపు తెరిచి ఉండడంతో పని మనిషి చూసి ఫోన్ చేయగా,హుటాహుటిన వచ్చి చూడటం తో వెండి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు,దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఒకే గొడుకు కిందకు నాలుగు బ్యాంకులు

**విజయవాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఏపీలో ఇక రకరకాల పేర్లతో గ్రామీణ బ్యాంకులు కనిపించవు. ఒకే ఒక గ్రామీణ బ్యాంకు ఇకనుంచి కొనసాగనుంది. కొద్ది రోజుల కిందట కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల విలీనంపై ప్రకటన చేసింది. నాలుగో విడత బ్యాంకుల విలీనంపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒకే దేశం- ఒకే ఆర్ఆర్బీ కింద దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్న గ్రామీణ బ్యాంకులను ఏకీకరించాలని నిర్ణయం తీసుకుంది. అంటే ఒక్కో రాష్ట్రంలో ఒక గ్రామీణ బ్యాంకు పేరు కొనసాగించనుంది. దీంతో ఏపీవ్యాప్తంగా ఉన్న నాలుగు గ్రామీణ బ్యాంకులు.. ఒకే గ్రామీణ బ్యాంకు గొడుగు కిందకు రానున్నాయి. ప్రస్తుతం ఏపీలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖలు ఉన్నాయి. ఇవన్నీ ఒకే సంస్థ కిందకు రానున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా మారనున్నాయి. ఈ లెక్కన ఇకనుంచి ఈ గ్రామీణ బ్యాంకులనేవి కనిపించవు. ఈవిలీన ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఒక ఉత్తర్వులు జారీ చేసింది. ఐదు రోజులపాటు బ్యాంకు సేవలను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 9 సాయంత్రం 6:00 నుంచి.. అక్టోబర్ 13 ఉదయం 10 గంటల వరకు ఈ ఐదు బ్యాంకుల సేవలు నిలిచిపోనున్నాయి. సామాజిక మాధ్యమాలతో పాటు ప్రతి ఖాతాదారుడు కి వ్యక్తిగతంగా సమాచారం వచ్చింది. గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఆఫ్లైన్ తో పాటు ఆన్లైన్ సేవలు కూడా నిలిచిపోనున్నాయి. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపిఎస్, ఏటీఎం సేవలు, బ్యాంకు మిత్రాలు కూడా అందుబాటులో ఉండబోవని స్పష్టం చేసింది. అయితే అక్టోబర్ 11రెండో శనివారం, 12 ఆదివారం బ్యాంకులకు సెలవులు. అప్పుడు కూడా ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉండవు. ఏటీఎంసేవలు కూడా అందుబాటులో ఉండని పరిస్థితి. మూడు రోజులపాటు పూర్తిగా సేవలు నిలిపివేయనున్నాయి. అయితే ఇప్పటికే గత కొద్ది రోజులుగా దీనిపై గ్రామీణ బ్యాంకులో అప్రమత్తంచేశాయి. లావాదేవీలు జరుపుకోవడానికి ఈరోజే చివరి దినం. సాయంత్రం 6 గంటల్లోగా సేవలను వినియోగించుకోవాలని గ్రామీణ బ్యాంక్ సూచించింది కస్టమర్లకు. అయితే డ్వాక్రా సంఘాల బ్యాంకు లావాదేవీలు అన్ని గ్రామీణ బ్యాంకుల ద్వారా జరుగు తాయి. అందుకే ఆయా బ్యాంకు యాజమాన్యాలు ముందస్తుగానే అప్రమత్తం చేశాయి.

## ప్రాణాలు కాపాడిన సెహభాస్ పోలీస్ అమర...!!

◆బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడికి పునర్జన్మను ఇచ్చిన పోలీస్

**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెకు వచ్చి బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన బెంగళూరు యువకున్ని పోలీస్ కానిస్టేబుల్ అమర చాకచక్యంగా కాపాడి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మను ఇచ్చాడు. ఆ వివరాలు.. బెంగళూరుకు చెందిన చెంగాచారి(26), భార్య శశి, కుమారిడి తో కలసి గురువారం మదనపల్లి లోని ఓ ప్రముఖ ఆలయానికి వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో భార్యా భర్తలు గొడవ పడ్డారు. భార్య శశి తిట్టిందని మనస్థాపంతో చేతి నరాలు కోసుకొని స్థానిక మడికయిల శివాలయానికి సమీపంలో ఉన్న కోడుగుడ్డు బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. అయితే బావిలో ఉన్న చెట్ల కొమ్మల ను పట్టుకుని రాత్రంతా కేకలు వేస్తూ.. కాపాడమని అరిచాడు. ఉదయం అటుగా వెళుతున్న పాదచారులు గుర్తించారు. అదే సమయంలో తన పిల్లలను స్కూలుకు బైకులో తోడుకుని వెళుతున్న మదనపల్లి రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ డ్రైవర్ అమర గుర్తించి వెంటనే రోపు సాయంతో చెంగా చారిని వెలికి తీసి కాపాడి స్థానికుల దగ్గర ప్రశంసలు అందుకున్నాడు.

## అటవీ శాఖలో దోపిడీ

**ఖమ్మం, సూర్య వాస్తవం, అక్టోబర్ 10:** ఖమ్మం జిల్లా అటవీ శాఖలో దోపిడీ జరిగింది. అయితే ఇదంతా ఇంటి దొంగలు పనే అని తేల్చారు ఉన్నతాధికారులు. కలప అక్రమ రవాణాలో ఎవరెవరి ప్రమేయం ఉందనే దానిపై జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ రేంజ్ఆఫీసర్లు దర్యాప్తు చేపట్టారు. చింతకాని మండలం నుంచి సర్కారు తుమ్మ కలప తరలిం చేందుకు ముందుగా నోఆబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని, అనంతరం సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలోని ప్రైవేట్ భూముల్లో నరికిన సంద్ర కలపను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు బహిర్గతమైంది. అయితే ఎలాంటి ఫీల్డ్ వెరిఫికేషన్ లేకుండా, వాల్టా ఫీజు వసూలు చేయకుండా, నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్ద్వారా ఆన్ లైన్‌లో ఎన్‌వోసీలను జారీ చేసినట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. ఇప్పటికే ప్రాథమిక దర్యాప్తులో భాగంగా చింతకాని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు. సంద్ర చెట్టు దుంగల అక్రమ రవాణాపై ఎంక్వైరీ చేస్తున్నామని ఖమ్మం ఆఈూ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు. పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిన తర్వాత బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆఈూ తెలిపారు. చట్టవిరుద్ధ పనుల్లో పాల్గొన్న అధికారులు, వ్యక్తులపైనా క్రిమినల్ చర్యలు ఉంటాయన్నారు. గుట్కా వంటి పాన్ మసాలాల తయారీలో, పాన్‌లో ఉపయోగించే కత్తా తయారీలో సంద్ర కలపను వినియోగిస్తారని అధికారుల ఎంక్వైరీలో తేలింది. మధ్యప్రదేశ్?, మహారాష్ట్ర, గుజరాత్, హర్యానాలో ఇలాంటి పరిశ్రమలు ఉండగా.. అక్కడ కలపకు విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో తెలంగాణ జిల్లాల్లోని విలువైన సంద్ర కలపను తరలించేందుకు ఫేక్ ఎన్వోసీ రూట్ ను స్మగ్లర్లు ఎంచుకున్నట్టు అధికారులు గుర్తించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854